శనివారం
20-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 29
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇస్రో ఛైర్మన్‌కు మద్రాస్ ఐఐటీ పీహెచ్‌డీ పట్టా

చెన్నై: ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ మద్రాస్ ఐఐటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఐఐటీ మద్రాస్‌లో శుక్రవారం జరిగిన 61వ స్నాతకోత్సవంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఆయన డాక్టరేట్ పొందారు. 60ఏళ్ల వయసులో ఆయన పీహెచ్‌డీ పట్టా అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ మద్రాస్ ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కేరళలోని అళప్పుజ జిల్లాలో జన్మించిన సోమనాథ్... అదే జిల్లా ఆరూర్‌లోని సెయింట్ అగస్టీన్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్య అభ్యసించారు. తర్వాత కొల్లాంలోని టీకేఎం కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు.

మైక్రోసాఫ్ట్ విండోస్ క్రాష్

ప్రపంచవ్యాప్తంగా నిలిచిన సేవలు

విమానాలు రద్దు... బ్యాంకులు, మార్కెట్లపై ప్రభావం

న్యూఢిల్లీ: ప్రముఖ సాఫ్ట్‌వేర్ మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలు ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. ఈ ప్రభావంతో అనేక మంది వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 'మైక్రోసాఫ్ట్ ఔటేజ్' సమస్య కారణంగా అంతర్జాతీయంగా విమానాలు, మార్కెట్లు, బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజీ సేవలపై ప్రభావం పడింది. శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా అనేక మంది వినియోగదారులు తమ కంప్యూటర్‌లలో విండోస్ 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్(బీఎస్ఓడీ)' సమస్య ఎదురైందని సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. దీంతో విమానాశ్రయాలు, టెలివిజన్ వార్తా కేంద్రాలు, ఆర్థిక సంస్థలు సహా అనేక చోట్ల ఈ ప్రభావం కనిపించింది. దీనిపై అనేక మంది సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక నివేదికల ప్రకారం ఈ సమస్యకు కారణం ఇటీవల విడుదలైన క్రౌడ్‌స్ట్రైక్ కావచ్చని తెలుస్తోంది. క్రౌడ్‌స్ట్రైక్ అనేది యాంటీ వైరస్. ఇది ఎండ్‌పాయింట్ సెక్యూరిటీ కంపెనీ. వినియోగదారులు ఈ బీఎస్ఓడీ లోపాన్ని పొందడం ప్రారంభించిన వెంటనే క్రౌడ్‌స్ట్రైక్ సమస్య వచ్చింది. ఈ క్రమంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు కొన్ని గంటలపాటు నిలిచిపోయాయి. అమెరికాలో కొన్ని విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని నివేదికల ప్రకారం వినియోగదారులు మైక్రోసాఫ్ట్ 365ని యాక్సెస్ చేయడంలో సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ సమస్య కారణంగా కొన్ని విమానాలు రద్దయ్యాయి. చాలా మంది తమ రోజువారీ పనులు పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పైస్‌జెట్ సహా అనేక కంపెనీలు తమ సేవలు రద్దు చేశాయి. టికెట్ల బుకింగ్ సహా అనేక కార్యకాలపాలలో అవంతరాలు ఏర్పడటంతో విమానాలు రద్దయ్యాయి. ప్రస్తుతానికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం

- మిగతా 2 లో

వానలు... వరదలు

కోస్తా జిల్లాలు అతలాకుతలం

- పొంగుతున్న వాగులు, వంకలు
- తీరం వెంట 65 కి.మీ వేగంతో గాలులు
- పెదవాగు ఉధృతితో రహదారులన్నీ ధ్వంసం
- ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం
- నేడు కూడా అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఎగువ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నదికి కూడా వరద ఉధృతి గంట గంటకూ పెరుగుతోంది. బంగాళాఖాతంలో ఒడిశా, ఉత్తరాంధ్ర మీదుగా కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. వాయవ్య దిశగా పయనించి, పూరీ సమీపంలో శనివారం తెల్లవారు జామున తీరం దాటే అవకాశం ఉంది. ఆ తర్వాత క్రమంగా బలహీనపడనుంది. దీని ప్రభావంతో శనివారం కూడా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, కర్నూలు అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు వాయుగుండగా బలపడిన అల్పపీడనం రేపు ఒడిశా తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఏపీలో మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు పడనున్నాయని పేర్కొంది. ఈ మేరకు కోస్తా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, కృష్ణ, గుంటూరు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు... కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. తీరం వెంబడి అత్యధికంగా గంటకు 65 కిమీ వేగంతో గాలులు వీస్తుండటంతో వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అత్యవసర సహాయక చర్యల కోసం 3 ఎస్డీఆర్ఎఫ్, 2 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రవహిస్తున్న వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విశాఖ సమీపంలోని జ్ఞానాపురం పాతవంతెన వద్ద వరద నీరు నిలిచిపోయింది. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నందున విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. వేలేరుపాడు మండలంలో

- మిగతా 2 లో

'సెల్ఫ్ ఫైనాన్స్' ముసుగులో

వైద్య సీట్ల అమ్మకం

- ప్రభుత్వ నూతన వైద్యకళాశాలల్లో ఇష్టారాజ్యం
- ప్రతిభావంతులు, రిజర్వేషన్ విద్యార్థులకు శాపం
- గత ప్రభుత్వ విధానాలే కొనసాగింపు ?
- జీవో 107, 108 రద్దు చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రానికి కొత్తగా మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో స్వీయ ఆర్థిక (సెల్ఫ్ ఫైనాన్స్) సీట్ల వ్యవహారం పేద, ప్రతిభగల విద్యార్థులకు శాపంగా మారింది. ఈ సీట్ల భర్తీకి గత ప్రభుత్వం జారీజేసిన జీవో 107, జీవో 108పై గందరగోళం నెలకొంది. సెల్ఫ్ ఫైనాన్స్ ముసుగులో సీట్లు అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ విధానాలనే...ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనుసరించేలా వ్యవహరిస్తుండటాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గత 2023-24 విద్యా సంవత్సరం...రాష్ట్రానికి కొత్తగా మంజూరైన ఐదు వైద్య కళాశాల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద 50శాతం సీట్లను భర్తీ చేయడం సర్వత్రా నిరసనలకు దారితీసింది. గత ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ పేదల పక్షపాతినని చెబుతూ...వైద్య కళాశాలల సీట్ల భర్తీలో తెరపైకి జీవోలు తేవడం వివాదస్పదంగా మారింది. అప్పట్లో విపక్షాలు, విద్యార్థి, యువజన సంఘాలు దొడ్డిదారిన సీట్లు

- మిగతా 2 లో

అమెరికాలో భారత రాయబారిగా క్వాత్రా



న్యూఢిల్లీ: అమెరికాకు భారతదేశ కొత్త రాయబారిగా ప్రస్తుత భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ మోహన్ క్వాత్రా నియమితులయ్యారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. జనవరిలో రిటైర్ అయిన తరణ్‌జిత్ సింగ్ సంధు స్థానంలో క్వాత్రా బాధ్యతలు చేపట్టనున్నారు. సంధు 2020 నుంచి 2024 జనవరి వరకూ అమెరికా రాయబారిగా ఉన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు, డోనాల్డ్ ట్రంప్ తిరిగి పగ్గాలు చేపట్టే అవకాశాలున్నాయనే అంచనాల నేపథ్యంలో ఆ దేశానికి భారత రాయబారిగా క్వాత్రా నియమితులు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 1988 బ్యాచ్ ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారి అయిన వినయ్ మోహన్ క్వాత్రా 2022 మే 1 నుంచి 2024 జులై 14 వరకూ భారతదేశ 34వ విదేశాంగ కార్యదర్శిగా పనిచేశారు. ఫారెన్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టడానికి ముందు నేపాల్‌కు భారత రాయబారిగా పనిచేశారు. దౌత్యవేత్తగా 34 ఏళ్ల అనుభవం ఉన్న క్వాత్రా 2017 ఆగస్టు నుంచి 2020 ఫిబ్రవరి వరకూ ఫ్రాన్స్ రాయబారిగా పనిచేశారు. క్వాత్రా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విధాన ప్రణాళిక-పరిశోధన విభాగానికి నాయకత్వం వహించారు. మే 2010 నుండి జులై 2013 వరకు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంలో మంత్రి (వాణిజ్యం)గా కూడా పనిచేశాడు. 2015-2017 మధ్య ప్రధానమంత్రి కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత ఫిబ్రవరి 2020 వరకు ఫ్రాన్స్‌కు రాయబారిగా ఉన్నారు.

మద్యం అక్రమాలపై సీఐడీ దర్యాప్తు ముమ్మరం

వాసుదేవరెడ్డి పాత్రపై ఆధారాల సేకరణ

తక్కువ రకం బ్రాండ్‌లు 35 నుంచి 2కి కుదింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం అక్రమాలపై సీఐడీ దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. మద్యం తయారీ కేంద్రాలు, విక్రయాల్లో జరిగిన అక్రమాల తీరుపై అధికారుల నుంచి వివరాలు సేకరిస్తోంది. విచారణలో భాగంగా మద్యం అక్రమాల్లో అప్పట్లో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీతో పాటు డిస్టిలరీల కమిషనర్‌గా పని చేసిన వాసుదేవరెడ్డి పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తోంది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీతో పాటు డిస్టిలరీల కమిషనర్‌గా జగన్ ప్రభుత్వం వాసుదేవరెడ్డికి బాధ్యతలు అప్పగించింది. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కమిషనర్‌లకు కూడా ఫైళ్లు పంపించాల్సిన అవసరం లేకుండా నిర్ణయాలు తీసుకునేలా అధికారాలు ఇచ్చింది. దీంతో తాను తల్చుకుంటే ఉన్నతాధికారులను సైతం బదిలీ చేయించగలనంటూ వాసుదేవరెడ్డి బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. మద్యం కొనుగోళ్ల లోనూ భారీగా అవకతవకలకు ఆయన తెరలేపారు. ఒకే రకమైన బ్రాండ్ మద్యాన్ని తెలంగాణ కంటే అధిక ధరకు కొనుగోలు చేసినట్టు విచారణలో సీఐడీ గుర్తించింది. వాసుదేవ రెడ్డి అక్రమాలు అంచనాకు అందడం లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బినామీ పేర్లతో

- మిగతా 2 లో

అధ్యక్ష ఎన్నికల బరినుంచి బైడెన్ ఔట్?

రేసులోకి కమలా హ్యారిస్

మరికొద్దిరోజుల్లో ప్రకటన వచ్చే అవకాశం

మరికొద్ది నెలల్లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండగా... రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కే విజయావకాశాలున్నట్లు మీడియా కథనాలు వస్తుండటం, మరో సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత, మరోవైపు ఆరోగ్య సమస్యలు వేధిస్తున్న క్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ ఎన్నికల బరి నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది.

8లో

ఇదీ లోకం!

హమ్మయ్యా... మొత్తానికి అధికారం ఎక్కడుంటే అక్కడికి వచ్చేసావ్!

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి

- టీడీపీ ఆటవిక పాలనపై ఢిల్లీలో ధర్నా చేస్తాం
- హత్యలు, దాడులపై ప్రధానికి ఫిర్యాదు చేస్తాం
- వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో ఆటవిక పాలన సాగుతోందని... రాష్ట్రపతి పాలన విధించాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. గెలిచిన 11 మంది ఎమ్మెల్యేలతోపాటూ ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొంటారని వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండలో దారుణ హత్యకు గురైన వైసీపీ కార్యకర్త రషీద్ కుటుంబాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్ శుక్రవారం పరామర్శించారు. బెంగళూరులో ఉన్న వైఎస్ జగన్... విషయం తెలుసుకున్న తరువాత తాడేపల్లికి వచ్చారు. మంగళగిరి నుంచి రోడ్డు మార్గం ద్వారా వినుకొండ చేరుకున్నారు. దారిపొడవునా పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. వినుకొండ చేరుకున్న వెంటనే బాధితుని ఇంటికి చేరుకున్న జగన్ ముందుగా ప్రాణాలు కోల్పోయిన రషీద్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం భావోద్వేగానికి గురైన రషీద్ తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చారు. తప్పక న్యాయం జరిగేలా

- మిగతా 2 లో

నిబంధనల మేరకే

జగన్‌కు భద్రత

వైసీపీ ఆరోపణలను ఖండించిన ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భద్రతపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, కండీషన్‌లో లేని పోలీస్ కాన్వాయ్ ఇచ్చారని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా తప్పుబట్టింది. జగన్ భద్రత తగ్గించారనే ప్రచారాన్ని కూడా ప్రభుత్వం

- మిగతా 2 లో

అట్టుడుకుతున్న బంగ్లాదేశ్

- రిజర్వేషన్లు రద్దుపై తీవ్ర ఆందోళనలు
- హింసాత్మక ఘటనల్లో 39కి చేరిన మృతులు
- ఢాకాలో మొబైల్, ఇంటర్నెట్ సేవల నిలిపివేత

ఢాకా: బంగ్లాదేశ్ ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో స్వాతంత్ర్య సమరయోధుల కోటా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. హింసాత్మక ఘటనల్లో ఇప్పటివరకు 39 మంది ఆందోళనకారులు మరణించారు. మరో 2,500 మందికి పైగా గాయపడినట్లు తెలిసింది. రిజర్వేషన్ల రద్దుపై బంగ్లాదేశ్ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం బంద్‌కు పిలుపునిచ్చారు. అప్పటికే విద్యా సంస్థలను ప్రభుత్వం మూసివేసింది. అయినా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసనలకు దిగడంతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలీసులు కొన్నిచోట్ల రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. ఆందోళనకారులు, ప్రభుత్వ అనుకూల విద్యార్థి సంఘం నేతలు ఇటుకలు, వెదురు కర్రలతో పరస్పరం దాడికి పాల్పడ్డారు. ప్రభుత్వ టీవీ ఛానల్ భాబన్ కార్యాలయంపై ఆందోళనకారులు దాడి చేశారు. దీంతో 1200 మంది సిబ్బంది లోపలే ఉండిపోయారు. బయట ఉన్న వాహనాలకు నిప్పు పెట్టారు. మరణించిన వారిలో ఎక్కువ మంది ఢాకాకు చెందినవారే ఉన్నారు. ప్రైవేటు వర్సిటీలు అధికంగా ఉన్న ఢాకా ఉత్తర ప్రాంతంలో ఘర్షణలు ఎక్కువగా జరిగాయి. గురువారం ఒక్కరోజే 19 మంది ఆందోళనకారులు మరణించినట్లు అక్కడి అధికారులు తెలిపారు. కాగా రాజధాని ఢాకాలో శుక్రవారం పోలీసులు, భద్రతా అధికారులు నిరసనకారులపై బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. రాజధానిలో అన్ని సమావేశాలను నిషేధించారు. హింసాత్మక ఘటనల తర్వాత ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేశారు. కొన్ని వారాల క్రితం ప్రారంభమైన నిరసనలు సోమవారం తీవ్రస్థాయికి చేరాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన జనవరి ఎన్నికల్లో వరుసగా నాల్గవసారి గెలిచినప్పటి నుండి ప్రధాని షేక్ హసీనాకు రిజర్వేషన్ల ఆందోళన అతిపెద్ద సవాలుగా మారింది. శుక్రవారం భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మరో నలుగురు మరణించారని సోమోయ్ టీవీ తెలిపింది. అయితే మరణాలకు సంబంధించిన గణాంకాలను అధికారులు నిర్ధారించలేకపోతున్నారు. ప్రభుత్వం రాజధాని అంతటా పోలీస్, పారామిలటరీ బలగాలను మోహరించింది. ఈ క్రమంలో శాంతియుతంగా ఉండాలంటూ నిరసనకారులను ఉద్దేశించి బంగ్లా ప్రధాని షేక్ హసీనా బుధవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సంస్థ బీటీవీ ప్రధాని వీడియో సందేశాన్ని ప్రసారం చేసింది. దీనిపై మండిపడ్డ నిరసనకారులు గురువారం ఢాకాలోని బీటీవీ ప్రధాన కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులపైకి పోలీసులు రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు బీటీవీ ఆఫీసులోకి చొచ్చుకెళ్లి ఫ్రంట్ ఆఫీసుకు నిప్పంటించారు. ప్రధాన ద్వారం వద్ద మంటలు చెలరేగడంతో చాలామంది ఉద్యోగులు లోపలే చిక్కుకుపోయారని బీటీవీ తెలిపింది. అయితే, ఆ తర్వాత కాసేపటికే సహాయ సిబ్బంది అందరినీ క్షేమంగా బయటకు తీసుకు వచ్చినట్లు ప్రకటించింది. ఆఫీసు పార్కింగ్ ప్లేస్ లోని అనేక వాహనాలకు నిరసనకారులు నిప్పుపెట్టారని వివరించింది. దీంతో బీటీవీ ప్రసారాలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. మృతిచెందిన నిరసనకారులకి న్యాయం జరగాలని, ప్రధాని హసీనా క్షమాపణ చెప్పాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు.

భారతీయులు సురక్షితం

ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం స్పందించింది. అక్కడున్న భారతీయులంతా సురక్షితమేనని ప్రకటించింది. "ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు ఆ దేశ అంతర్గత వ్యవహారం. అక్కడ 15వేల మంది భారతీయులు ఉన్నారు. వారిలో 8వేల మంది విద్యార్థులే. వారంతా సురక్షితంగానే ఉన్నారు. వారికి అన్ని రకాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది.

అల్లర్లకు కారణం...

బంగ్లాదేశ్ లో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి రిజర్వేషన్ వ్యవస్థ అమలులో ఉంది. దీని ప్రకారం మొత్తం ఉద్యోగాలలో 56 శాతం వివిధ కేటగిరీకి చెందిన అభ్యర్థులకు రిజర్వు చేస్తారు. ఇందులో ప్రధానంగా 1971లో పాకిస్థాన్ తో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సైనికుల కుటుంబాలకు 30 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. మిగతా వెనకబడిన కేటగిరీల అభ్యర్థులు 26 శాతం ఉద్యోగాలు దక్కించుకుంటారు. మొత్తం ఉద్యోగాలలో మూడో వంతు మాజీ సైనికుల కుటుంబాలకు చెందిన పిల్లలకే దక్కడంపై బంగ్లాదేశ్ యువత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ గతంలోనూ విద్యార్థులు ఆందోళనలు చేశారు. ఫలితంగా ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వ నియామకాల్లో 2018లో రిజర్వేషన్ వ్యవస్థను రద్దు చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మాజీ సైనికుల సంఘం హైకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ తర్వాత ఈ ఏడాది జులై 1 న 1971 యుద్ధంలో పాల్గొన్న సైనికుల పిల్లలకు 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో మరోసారి విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. హైకోర్టు తీర్పుపై అటార్నీ జనరల్ జులై 16న సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తీర్పును నాలుగు వారాల పాటు సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. ఆగస్టు 7న ఈ పిటిషన్ పై విచారణ జరిపి తీర్పు వెలువరిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

ఆందోళనలకు స్వస్తి పలికి క్లాసులకు హాజరు కావాలంటూ విద్యార్థులకు సూచించింది. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన విరమించలేదు. దీంతో విద్యార్థులపై ప్రధాని హసీనా ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆందోళనకారులను రజాకార్లంటూ విమర్శించారు. ఇది కాస్తా విద్యార్థుల్లో ఆగ్రహానికి కారణమైంది. ఫలితంగా ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. విద్యార్థులను నియంత్రించేందుకు పోలీసులు రబ్బరు బుల్లెట్లు ప్రయోగించగా.. ఇద్దరు విద్యార్థులు గాయపడి ప్రాణాలు కోల్పోయారు. తోటి విద్యార్థుల మరణంతో రెచ్చిపోయిన స్టూడెంట్లు పోలీసులపై దాడికి ప్రయత్నించగా.. పోలీసులు కాల్పులు జరపడంతో మరో ఐదుగురు చనిపోయారు.

నాలుగు నెలల్లో అద్భుత విజయం అందుకోబోతున్నాం: ట్రంప్

మిల్వాకీ: దేవుడి ఆశీస్సులు, అమెరికా ప్రజలు తనపై కురిపిస్తున్న ప్రేమ, మద్దతుతోనే తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పెన్సిల్వేనియాలో శనివారం తనపై హత్యాయత్నం విఫలమైన తర్వాత ట్రంప్ తొలిసారి ప్రసంగించారు. విశ్వాసం, బలం, ఆశతో కూడిన సందేశంతో అమెరికన్ల ముందు నిలబడ్డానంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఉండేందుకు మీ నామినేషన్‌ను విశ్వాసం, భక్తితో గర్వంగా అంగీకరిస్తున్నానంటూ ఉద్వేగపూరితంగా ప్రసంగించారు. ఈ ప్రయాణంలో తనతో సతీమణి మెలానియా అండగా ఉందని.. అందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. "నాలుగు నెలల్లో మనం అద్భుతమైన విజయాన్ని పొందబోతున్నాం. దేశ చరిత్రలో నాలుగు గొప్ప సంవత్సరాలను ప్రారంభించనున్నాం. అందరం కలిసి జాతి, రంగు, మతంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికీ భద్రత, శ్రేయస్సు, స్వేచ్ఛతో కూడిన కొత్త శకాన్ని అందించబోతున్నాం. మన సమాజంలోని విభేదాలు, విభజనలు నయం కావాలి. అమెరికన్లుగా మనమంతా ఒకే ఉమ్మడి విధికి కట్టుబడి ఉన్నాం" అని ట్రంప్ అన్నారు. " అమెరికన్ ప్రజలకు సేవ చేసే ప్రభుత్వాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నానని... నేను ఇవ్వాల్సినవన్నీ నా హృదయం నుంచి ఇస్తాను.. శక్తి మేర పోరాడతానని ప్రతిజ్ఞ చేస్తున్నా" అంటూ ట్రంప్ ఉద్వేగంతో మాట్లాడారు. తనపై జరిగిన కాల్పుల ఘటనను ట్రంప్ గుర్తు చేసుకుంటూ... బుల్లెట్ సరిగ్గా దగ్గరకు వచ్చిన సమయంలోనే తాను తల తిప్పానని చెప్పారు.

మైక్రోసాఫ్ట్ విండోస్ క్రాష్

(మొదటిపేజీ తరువాయి)

సూచించలేదు. అయితే క్రౌడ్‌స్ట్రైక్ సమస్యను పరిశోధిస్తోంది. త్వరలో ఒక ప్యాచ్‌ను విడుదల చేయాలని భావిస్తున్నారు.

సైబర్ దాడి కాదు... సమస్యను పరిష్కరించాం: మైక్రోసాఫ్ట్

వాషింగ్టన్: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యపై టెక్ దిగ్గజం స్పందించింది. సమస్య పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. 'బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్'కు కారణమైన క్రౌడ్ స్ట్రైక్ అప్‌డేట్ వెనక్కి తీసుకుంది. దీనికి డీబగ్ రూపొందించామని, సమస్య పరిష్కారమైనట్లు కంపెనీ ప్రకటించింది. కానీ, ఇంకా మైక్రోసాఫ్ట్ 365 యాప్స్, సర్వీసుల్లో సమస్య కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అటు సైబర్ సెక్యూరిటీ సంస్థ క్రౌడ్ స్ట్రైక్ సీఈఓ జార్జ్ కుర్జ్ కూడా దీనిపై స్పందించారు. 'సింగిల్ కంటెంట్ అప్‌డేట్‌లో బగ్‌తో తలెత్తిన వినియోగదారులతో మా కంపెనీ సంప్రదింపులు జరుపుతోంది. మ్యాక్, లైనక్స్ సిస్టమ్‌లపై ఎలాంటి ప్రభావం పడలేదు. అయితే, ఇది భద్రతాపరమైన వైఫల్యమో, సైబర్ దాడో కాదు. సమస్యను గుర్తించి డీబగ్ ఫిక్స్ చేశాం. క్రౌడ్ స్ట్రైక్ కస్టమర్ల భద్రతకు మేం పూర్తి ప్రాధాన్యమిస్తాం' అని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

మైక్రోసాఫ్ట్‌తో చర్చిస్తున్నాం: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంపై కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ స్పందించారు. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మైక్రోసాఫ్ట్‌తో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతిక సమస్యకు కారణాలు గుర్తించినట్లు ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. వీటి పరిష్కారానికి అప్‌డేట్‌లు విడుదలయ్యాయని ప్రకటించారు. నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ నెట్‌వర్క్ ఎలాంటి ప్రభావానికి గురికాలేదని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు సంబంధించి కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ సాంకేతిక సలహాలు జారీ చేస్తుందని వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది యూజర్లకు బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ దర్శనమిస్తోంది. భారత్ సహా అమెరికా, ఆస్ట్రేలియాలోనూ ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

చేతిరాతతో బోర్డింగ్ పాస్‌లు

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా భారత్‌లోని విమానయాన సంస్థలు తమ సేవలను మాన్యువల్‌గా నిర్వహిస్తున్నాయి. ఇండిగో, విస్తారా, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ తదితర విమానయాన సంస్థలు భారత్‌లో తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. దీంతో ప్రయాణికులను మాన్యువల్‌గా చెక్ చేసి చేతి రాతతో కూడిన బోర్డింగ్ పాస్‌లు ఇస్తున్నారు. కొంతమంది ప్రయాణికులు ఇందుకు సంబంధించిన ఫొటోలు పంచుకుంటున్నారు. 'నేషన్‌హెచ్‌క్యూ' సహ వ్యవస్థాపకుడు అక్షయ్ కొఠారీ చేతి రాతతో కూడిన బోర్డింగ్ పాస్‌ను ప్రయాణానికి ముందు ఎక్స్‌లో షేర్ చేశారు. తమ ఆన్‌లైన్ సేవలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, వాటిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని విమానయాన సంస్థలు ప్రయాణికులకు ప్రకటనల ద్వారా తెలియజేస్తున్నాయి.

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి

(మొదటిపేజీ తరువాయి)

చూస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ వారు వైసీపీ కార్యకర్తలపై దాడులు, హత్యలకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్నారు. టీడీపీ గద్దెనెక్కిన 45 రోజుల్లో 36 రాజకీయ హత్యలు, 300 మందికి పైగా హత్యాయత్నాలు జరిగాయన్నారు. అలాగే టీడీపీ నాయకుల వేధింపులకు తట్టుకోలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రూ.560 కోట్లు విలువైన ప్రైవేటు ఆస్తులు. 490 కోట్ల ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని, రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లాలో గత వైసీపీ పాలనలో ఎస్పీ రవిశంకర్ రెడ్డి నిజాయితీగా పని చేస్తే ప్రభుత్వం మారగానే అతని మార్చారన్నారు. అలాగే ఎస్పీ బిందు మాధవిని సస్పెండ్ చేశారని, అలాగే మల్లికా గర్గేను సాగనంపారన్నారు. జిల్లాకు కొత్త ఎస్పీ శ్రీనివాసరావును తీసుకు వచ్చిన వెంటనే రెండు రోజులకు వినుకొండలో ప్రజలందరూ చూస్తుండగా టీడీపీకి చెందిన జిలాని, అతను వర్గీయులు వైసీపీకి చెందిన ఎస్కే రషీద్‌ను అతి దారుణంగా నరికి చంపడం జరిగిందన్నారు. నిందితుడు జిలాని స్థానిక ఎమ్మెల్యే ఇంటిలో నారా లోకేశ్ బర్త్‌డే సందర్భంగా సంబరాలు చేసుకుంటున్న ఫోటోలను జగన్‌మోహన్ రెడ్డి మీడియాకు చూపెట్టారు. రషీద్‌ను హత్య చేయడమే కాకుండా... మిగతా వారిని కూడా ఇలాగే చంపుతాం అంటూ మెసేజ్‌లు పెట్టడం అత్యంత దారుణమన్నారు. అయితే కొత్తగా వచ్చిన ఎస్పీ ఈ హత్య ఇరువురి మధ్య వ్యక్తిగత కారణాలవల్ల జరిగిందని చెప్పటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కారని, హామీలన్నీ బుట్ట దాఖలు అవుతున్నాయని చెప్పారు. విద్యా దీవెన ఇవ్వలేదని... 18 ఏళ్లు దాటిన మహిళలందరికీ 1500 అన్నారు... రెండు కోట్ల 10 లక్షల మందికి పైగా ఉన్నారు ఎవరికీ ఇవ్వలేదని తెలిపారు. ప్రతి మహిళను మోసం చేశారని ఆరోపించారు. ఇలా హత్యలు, దాడులు చేస్తూ... ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని జగన్ విమర్శించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం విప్పి రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను రాష్ట్ర ప్రజలకు తెలుపుతామన్నారు. బుధవారం దిల్లీలో రాష్ట్రంలో జరుగుతున్న దారుణ సంఘటనలకు వ్యతిరేకంగా ధర్నా చేపడతామని తెలిపారు. ప్రధానిని, కేంద్ర హోంమంత్రిని కలిసి వివరించేందుకు అపాయింట్‌మెంట్ అడుగుతున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బాధిత కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌తోపాటు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, రజని, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ ఎల్ అప్పిరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పోతిన మహేష్, తలసిల రఘురాం, స్థానిక వైసీపీ నేతలు పీఎస్ ఖాన్ తదితరులు ఉన్నారు.

ప్రధానికి లేఖ

వైఎస్ జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీని లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయని... రాజ్యాంగబద్ధ సంస్థలు సక్రమంగా పని చేయడం లేదని, ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, భయానక వాతావరణం ఉందన్నారు. ప్రజలకు మేలు జరిగే పాలన అందివ్వడం లేదని తెలిపారు. రాజకీయాల్లో వైసీపీ అనే పార్టీ ఉండకూడదనే లక్ష్యంతోనే దాడులు, దుర్మార్గాలు చేస్తున్నారని తెలియజేశారు. అధికారంలోకి రాక ముందు నుంచే రెడ్‌బుక్ పేరుతో అధికారులను, ప్రత్యర్థులను బెదిరించారని ఇప్పుడు దాన్నేఅమలు చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత ఏపీలో జరిగిన ఘర్షణలపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో దర్యాప్తు చేయాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు దిగజారుతున్నాయని ఇక్కడ వాస్తవ స్థితిగతులు వివరించేందుకు అపాయింట్ మెంట్ ఇవ్వాలని ప్రధానమంత్రిని జగన్ కోరారు.

నిబంధనల మేరకే జగన్‌కు భద్రత

(మొదటిపేజీ తరువాయి)

ఖండించింది. జగన్‌కు జడ్‌ప్లస్ సెక్యూరిటీ ఇచ్చేంత భద్రత ఉందని పోలీసు శాఖ నిర్ధారించినది. వాహనం ఫిట్‌నెస్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవాల్లేవని వారి ఆరోపణలను కొట్టిపారేసింది. జగన్‌కు కేటాయించిన వాహనం పూర్తి ఫిట్‌నెస్‌తో ఉందని, కండీషన్ చూసిన తరువాతనే వీఐపీకి కేటాయించామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌కు సౌకర్యంగా లేదని కారు దిగారని, దానికి వాహనం ఫిట్‌గా లేదని ప్రచారం చేయడం తగదని అధికారులు పేర్కొన్నారు. జగన్ కారు దిగిన తరువాత అదే కాన్వాయ్‌లో ఆ వాహనం వెళ్లిందని, ఎటువంటి ఇబ్బంది లేదని అధికారులు తేల్చి చెప్పారు. జగన్ వెంట వచ్చిన వాహనాలు నిలిపివేశారనే ప్రచారాన్ని కూడా అధికారులు కొట్టిపడేశారు. వినుకొండలో ర్యాలీలకు, సభలకు అనుమతి లేదని, అయినప్పటికీ జగన్ వెళ్లే పరామర్శ కార్యక్రమానికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. వినుకొండ వెళ్తున్న జగన్ కాన్వాయ్‌లోని ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేల వాహనాలను ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు ఆపేసినట్లు వైసీపీ నేతలు చేసిన ఆరోపణలు సత్యదూరమని తెలిపారు.

ఆదాయంలో బీఆర్ఎస్ టాప్

వ్యయంలో టీఎంసీ... ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : దేశంలోని రాజకీయ పార్టీల ఆదాయ, వ్యయాలను ఏడీఆర్ వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రాంతీయ పార్టీలలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 737.67 కోట్లు... మొత్తం ఆదాయంలో 42.38 శాతంతో ఆదాయ జాబితాలో అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా ఖర్చు చేసిన మొదటి ఐదు పార్టీలు ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రూ.181.18 కోట్లు లేదా 37.66 శాతం, వైఎస్సార్ కాంగ్రెస్ రూ.79.32 కోట్లు లేదా 16.49 శాతం, బీఆర్ఎస్ రూ.57.47 కోట్లు లేదా 11.94 శాతం, డీఎంకే రూ.52.63 కోట్లు లేదా 10.94 శాతం, సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) రూ.31.41 కోట్లు లేదా మొత్తం వ్యయంలో 6.53 శాతం ఖర్చు చేసిందని ఏడీఆర్ తెలిపింది. భారతదేశంలోని ప్రాంతీయ రాజకీయ పార్టీల ఆర్థిక స్థితిపై వెల్లడయిన విశ్లేషణలో, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) 2022-23 ఆర్థిక సంవత్సరానికి 57 ప్రాంతీయ పార్టీలలో 39 పార్టీలకు సంబంధించి వివరణాత్మక ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించింది. ఇక నివేదికలో విశ్లేషించిన 39 ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయానికి సంబంధించి బీఆర్ఎస్ తర్వాత, టీఎంఎస్ అత్యధిక ఆదాయం రూ.333.45 కోట్లు లేదా 19.16 శాతం, ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) రూ.214.35 కోట్లు లేదా 12.32 శాతం ఆదాయాన్ని కలిగి ఉన్నాయని ఏడీఆర్ పేర్కొంది. సమష్టిగా మొదటి ఐదు పార్టీల ఖాతా రూ.1,541.32 కోట్లు లేదా పార్టీల మొత్తం ఆదాయంలో 88.56 శాతం అని విశ్లేషించగా, 39 ప్రాంతీయ పార్టీల మొత్తం ప్రకటిత ఆదాయం రూ.1,740.48 కోట్లుగా ఉంది. రాజకీయ పార్టీల వార్షిక ఆడిట్ చేసిన ఖాతాలను సమర్పించడానికి అక్టోబర్ 31, 2023ని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గడువుగా నిర్ణయించింది. అయితే వాటిలో 16 మాత్రమే కాలపరిమితికి కట్టుబడి ఉన్నాయి.

23 పార్టీలు తమ నివేదికలను ఆలస్యంగా సమర్పించాయి. మూడు నుంచి 150 రోజుల వరకు ఆలస్యం అవుతోంది. శివసేన (ఎస్‌హెచ్‌ఎస్), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్), జమ్మూకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శివసేన (యూబీటీ) వంటి ప్రముఖ పార్టీలతో సహా 18 ప్రాంతీయ పార్టీల ఆడిట్ నివేదికలు ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో లేవు. నివేదిక తయారీ సమయం ఏడీఆర్ తెలిపింది.

సీఐడీ దర్యాప్తు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని డిస్టిలరీ వ్యాపారాల్లోకి ఆయన చొరబడినట్లు సీఐడీ చెబుతోంది. తక్కువ ధర బ్రాండ్‌ల కొనుగోలును జగన్ ప్రభుత్వం గణనీయంగా తగ్గించేసింది. 2014-2019 మధ్యలో తక్కువ రేటు ఉన్న మద్యం బ్రాండ్‌లు 32 రకాలు అందుబాటులో ఉంటే... వైసీపీ ప్రభుత్వం రెండుకి కుదించింది. వాటినే అధిక ధరలకు విక్రయించి జగన్ ప్రభుత్వం సొమ్ము చేసుకుందని సీఐడీ అధికారులు ఆరోపించారు. కొన్ని ప్రీమియం బ్రాండ్‌ల తరహాలోనే వాటి పేర్లు పెట్టి... మద్యం ఉత్పత్తి, విక్రయాలు చేసినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లభ్యం కాని జే బ్రాండ్‌లు మార్కెట్‌లోకి తెచ్చి... వాటిని అధిక ధరలకు అమ్మి జగన్ ప్రభుత్వం సొమ్ము చేసుకున్నట్లు నిర్ధారించారు.

సబ్ లీజుల పేరుతో 11 డిస్టిలరీలను జగన్ అనుచరులు హస్తగతం చేసుకున్నట్లు విచారణలో సీఐడీ గుర్తించింది. జే గ్యాంగ్ హస్తగతం చేసుకున్న డిస్టిలరీల నుంచే 65 శాతం మేర వాసుదేవరెడ్డి మద్యం కొనుగోళ్లు చేశారు. 2014-19 మధ్య కాలంలో ఉన్న టాప్ 5 బ్రాండ్ల మద్యాన్ని 2019 తర్వాత కొనడం ఆపివేశారు. అప్పుల చెల్లింపుల కోసం మద్యం ఆదాయాన్ని, ఏపీ రాష్ట్ర అభివృద్ధి సంస్థకు రూ.14,276 కోట్లు మళ్లించినట్టు సీఐడీ అధికారులు గుర్తించారు. ఇలాంటి అనేక అక్రమాలను సీఐడీ అధికారులు లోతుగా దర్యాప్తు చేసి వెలికి తీస్తున్నారు.

వానలు... వరదలు

(మొదటిపేజీ తరువాయి)

ఆకాశానికి రంధ్రం పడిందా అన్నట్లుగా కురిసిన వర్షం వలన వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లి వరద ఉధృతి ప్రజలను హడలెత్తిస్తోంది. మండలంలోని లోతు వాగు, ఎద్దు వాగు, పెద్ద వాగు తదితర వాగులు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహిస్తూ స్థానిక ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తున్నాయి. అంతకంతకూ పెరుగుతున్న వరదతో, ఎడతెరిపిలేని కురుస్తున్న వర్షం వలన పల్లపు ప్రాంతాలు మొత్తం జలమయమయ్యాయి. వాగులు పరీవాహక ప్రాంతాల్లోని రహదారులు ఎక్కడికక్కడే నీట మునిగి వరద ఉధృతికి అనేకచోట్ల గండ్లు పడ్డాయి. ఈ మండలంలోని ప్రధాన రహదారులు సైతం కొట్టుకుపోవడంతో బాహ్య ప్రపంచంతో మండలానికి సంబంధాలు తెగిపోయాయి. వరద మధ్యలో, పల్లపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను అధికారులు మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. తెలంగాణ పరిధిలోని పెద్ద వాగు ప్రాజెక్టు విలీన మండలాలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదకు దిగువ ప్రాంతంలో ఉన్న గ్రామాల్లోని పంట పొలాలు నామరూపాలు లేకుండా దెబ్బతిన్నాయి. కమ్మరిగూడెం, మేడేపల్లి, కోయమాదారం, అల్లూరి నగర్, రాళ్లపూడి, వసంతవాడ, మద్దిగట్ల, పాతపూచిరాల తదితర గ్రామాలకు పెద్ద వాగు ప్రాజెక్టు వలన భారీ నష్టం చేకూరింది. పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయి. పశువులు, మేకలు కూడా వరదలకు కొట్టుకుపోయాయి. 25 సంవత్సరాల క్రితం అదే ప్రాజెక్టు తెగిందని, మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి నెలకొని తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోండి : సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. వర్షాలు అధికంగా ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ఆయా జిల్లాల్లో ఉన్న తాజా పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ శాఖ ద్వారా వర్షాలు, వరదలను అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు.

ముందస్తు ప్రణాళికతో పని చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 185 మి.మి గాను 244 మి.మి నమోదయిందని, రాష్ట్ర వ్యాప్తంగా 31 శాతం అదనంగా వర్షపాతం నమోదయిందని అన్నారు. 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలు కూడా ఉన్నాయన్న సీఎం, చెరువు కట్టలు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాల వల్ల గోదావరి కట్టలు బలహీన పడ్డాయని, వీటిపై దృష్టిపెట్టాలని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విపత్తులు వచ్చినప్పుడే పనితీరు, సమర్థత బయటపడుతుందని, అధికారులు ఎల్లవేళలా అప్రమత్తతతో వ్యవహరించి సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య సీట్ల అమ్మకం

(మొదటిపేజీ తరువాయి)

అమ్ముకుంటున్నారని పెద్దఎత్తున ఉద్యమించాయి. విజయవాడ హెల్త్ యూనివర్సిటీ ఎదుట నిరసనకు దిగాయి. ఈ జీవోలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, తక్షణమే వాటిని రద్దు చేయాలని హెచ్చరించాయి. వారి ఆందోళనలకు నాడు టీడీపీ అనుబంధ సంఘం మద్దతిచ్చింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 107, 108ను రద్దు చేస్తామంటూ స్వయంగా నారా లోకేశ్ విద్యార్థులకు హామీ ఇచ్చారు.ఇప్పుడు మౌనం దాల్చడం, దీనిపై కొనసాగుతున్న కేసులో తాజాగా హైకోర్టుకు పాత ఫీజుల విధానాన్నే కొనసాగిస్తామని కూటమి ప్రభుత్వం నివేదించడం వెరసి విద్యార్థులను మోసగించడమేనని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం పాటిస్తున్న సంకేతాలను తీసుకురావడంపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది. అటు కొత్త వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ వ్యవహారంపై విద్యార్థులకు చుక్కలు కన్పిస్తున్నాయి. గత విద్యా సంవత్సరం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, విద్యార్థులు నీట్‌లో 443 మార్కులు సాధించినా అవకాశం దక్కడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోను ఇదే విధానం కొనసాగడంపై విద్యార్థులకు దిక్కుతోచడం లేదు. సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్ల భర్తీ కోసం జారీజేసిన జీవోలు రద్దు చేయాలంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి తదితరులు లేఖలు రాసినా స్పందన లేదు. విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగినా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కదలిక లేదు. దీంతో 2024-25 విద్యా సంవత్సరం ఈ కొత్త వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ వ్యవహారంపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

50 శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లతో రిజర్వేషన్లకు ముప్పు

ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల్లో 50శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్లతో రిజర్వేషన్, ప్రతిభ గల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లనుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి అనుమతులు తెచ్చినట్లు ఘనంగా ప్రచారం చేసుకుంది. ఇందులో 2023-24 విద్యా సంవత్సరం నుంచి మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల, రామచంద్రాపురం, విజయనగరంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 150 సీట్ల చొప్పున మొత్తంగా 750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి జాతీయ వైద్య విధాన పరిషత్ ఆమోదముద్ర వేసింది. ఐదు నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 750 సీట్లు మంజూరయ్యాయి. దీని ప్రకారం 750 సీట్లలో 112 సీట్లు జాతీయ కోటా కిందకు వెళ్లాయి. మిగిలిన 638 సీట్లలోని 50 శాతం సీట్లను కేటగిరి-ఏ కింద రాష్ట్ర విద్యార్థులతో రాష్ట్ర హెల్త్ యూనివర్సిటీ భర్తీ చేసింది. 638 సీట్లలో మిగిలిన మరో 50 శాతం సీట్లను సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా కింద విభజిస్తూ..అందులో 35 శాతం కేటగిరి-బి కింద, మరో 15 శాతం కేటగిరి-సిలో ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీ చేశారు. ఈ తరహాగా కేటగిరి-ఏ కింద ఫీజు రూ.15వేలు, కేటగిరి-బి ఫీజు రూ.12లక్షలు, కేటగిరి-సీలో భాగంగా ఎన్ఆర్ఐ కింద రూ.20లక్షలుగా నిర్ధారించారు. ఇందులో బి, సి కేటగిరీల కింద వచ్చే 50శాతం సెల్ఫ్‌ఫైనాన్స్ సీట్ల కారణంగా ప్రతిభ, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారు. బహిరంగంగా వైద్య విద్య సీట్ల అమ్మకాలకు గత ప్రభుత్వం తెరదీసి విమర్శపాలైంది. జీవోలు 107, 108 ఆధారంగా ఫీజుల వసూలు కోసం జనరల్ కన్వీనర్ కోటా కాకుండా, అదనంగా రెండు కేటగిరీలను గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి, వైద్య విద్యతో వ్యాపారం చేసిందన్న విమర్శల్ని మూటగట్టుకుంది. ప్రైవేట్ వైద్య కళాశాలల తరహాగానే...కొత్తగా ఏర్పడిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లోను సీట్ల భర్తీకి గత ప్రభుత్వం తెరలేపింది. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వైద్య సీట్లు వచ్చినప్పటికీ..భారీ ఫీజులు చెల్లించలేక మరోసారి నీట్ రాసేందుకు విద్యార్థులు ప్రయత్నిస్తున్నారు. మళ్లీ 2024-25 విద్యా సంవత్సరానికిగాను జాతీయ వైద్య విధాన పరిషత్ ఆమోదిస్తే..మరో ఐదు నూతన ప్రభుత్వ వైద్యకళాశాలల్లో సీట్ల భర్తీకి అనుమతులు వచ్చే అవకాశముంది. దీంతో ఉన్న జీవోలను రద్దు చేస్తేనే ప్రతిభ, రిజర్వేషన్ వర్గాలకు న్యాయం చేకూరుతుంది.

మంత్రి లోకేశ్ హామీ నిలబెట్టుకోవాలి: ఏఐఎస్ఎఫ్

ప్రభుత్వ నూతన వైద్యకళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల భర్తీకి గత ప్రభుత్వం తెచ్చిన జీవోలు 107, 108 రద్దు చేస్తానని నాడు పాదయాత్రలోను, వివిధ సందర్భాల్లోను టీడీపీ తరపున మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ... వైద్య విద్యా వ్యాపారానికి ద్వారాలు తెరుస్తూ..గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో 107, 108లను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ జీవోల విధానం కొనసాగిస్తే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మొత్తం వ్యాపార మయంగా మారనున్నాయని పేర్కొన్నారు. మూడు కేటగిరీలతో సీట్లను భర్తీ చేసి, వాటిలో 50శాతం సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ కేటగిరీలకు కేటాయించడం వల్ల ప్రతిభ విద్యార్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు అన్యాయానికి గురవుతారని వివరించారు. నూతన ప్రభుత్వ వైద్యకళాశాలలకు మంజూరైన అన్ని సీట్లలో జాతీయ కోటా కింద 15శాతం పోను, మిగిలిన 85శాతం సీట్లను మొత్తం కేటగిరి-ఏ కింద భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ద్వారా వేల కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలు వ్యాపార కేంద్రాలుగా మారాయని తెలిపారు. తక్షణమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పందించి జీవోలు 107, 108 రద్దు చేయాలని కోరారు.

రషీద్ హత్యను టీడీపీకి ఆపాదిస్తారా: మంత్రి డోలా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన రషీద్ హత్యను టీడీపీకి ఆపాదించడం సిగ్గుచేటని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా జగన్ మాత్రం తన బుద్ధి మార్చుకోలేదన్నారు. సొంత బాబాయిని చంపి నారాసుర రక్తచరిత్ర అంటూ టీడీపీపై తప్పుడు ప్రచారం చేసిన నీచ చరిత్ర జగన్‌దని, వినుకొండలో జరిగిన హత్యకు ముఖ్యకారకుడు జగనేనని ఆరోపించారు. వైసీపీ హయాంలో హతుడు రషీద్ నిందితుడు జిలానీ మధ్య జరిగిన గొడవలపై ఆనాడే చర్యలు తీసుకుని ఉంటే ఈ హత్య జరిగేదా? అని ప్రశ్నించారు.నాడు జగన్ చేసిన పాపానికి ఒక వ్యక్తి నిండు ప్రాణం బలైందన్నారు. వైసీపీ హయాంలో జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, నాడు ప్రతిపక్ష నేతల్ని బయట తిరగకుండా అడ్డుకున్న పిరికిపంద జగనేనని పేర్కొన్నారు. గతంలో రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేతలు పరామర్శించకుండా పోలీసులు అడ్డుపెట్టుకుని జగన్ నియంతృత్వంగా వ్యవహరించారన్నారు. నేడు టీడీపీ పాలనలో జగన్ స్వేచ్ఛగా తన పర్యటనలు తాను చేసుకుంటున్నారని... టీడీపీ, వైసీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఇప్పటికైనా జగన్ ఈ తరహా రాజకీయాలను మానుకోవాలని, ప్రజలే జగన్‌కు శాశ్వతంగా రాజకీయాలను నుంచి విముక్తి కలిగిస్తారని హెచ్చరించారు.

ప్రతి వారం సమీక్ష

శాఖల వారీ సమస్యల పరిష్కారం

మంత్రి నారా లోకేశ్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజాదర్బార్‌కు వస్తున్న విన్నపాలపై ప్రతి వారం సమీక్షించనున్నట్లు విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఉండవల్లి నివాసంలో లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఆయా విన్నపాలను శాఖల వారీగా విభజించి సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆయా విన్నపాలపై ప్రతివారం సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం జోరు వానలోనూ 19వ రోజు లోకేశ్ 'ప్రజాదర్బార్‌కు వినతులు పెద్దఎత్తున వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న 27 వేల మంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. కార్మికులను టెండర్లతో పని లేకుండా మస్టర్ రోల్ ద్వారా కొనసాగించాలనే హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని కోరారు. నంద్యాల జిల్లా, డోన్ మండలం, ధర్మారంలో తాము నిర్మించుకున్న చర్చికి ప్రహరీ గోడ, మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్డర్ కాపీ వచ్చిందని, నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన చిన్న యద్దయ్య విజ్ఞప్తి చేశారు. కడప జిల్లా గోపవరం నెల్లూరు జిల్లా కోటలోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యాసంస్థలో పని చేస్తున్న బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగులు కోరారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వాహన డ్రైవర్‌గా పని చేస్తున్న తనకు గత ప్రభుత్వం కక్షపూరితంగా జీతం నిలిపివేయడంతో పాటు ఉద్యోగం నుంచి తొలగించిందని, తగిన న్యాయం చేయాలని జి.రమేశ్ విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లోకేశ్ భరోసా ఇచ్చారు. అద్దె భవనంలో ఉన్న తాడేపల్లి కృష్ణనగర్ అంగన్ వాడీ పాఠశాలకు స్థలం కేటాయించడంతో పాటు శాశ్వత భవనం నిర్మించాలని డి.లీల విజ్ఞప్తి చేశారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని నవులూరుకు చెందిన బేతపూడి కోటేశ్వరరావు తదితరులు ప్రజాదర్బార్ ద్వారా వినతులు అందజేశారు.

ఆంధ్రా వర్సిటీలో ఇనుప కంచెల తొలగింపుపై అభినందన

గత పాలకుల హయాంలో వీసీ ఛాంబర్, పరిపాలన భవనంలోకి రాకుండా వీసీ వేయించిన ఇనుప కంచెలను తొలగించిన ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ శశిభూషణ్‌కు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది మధ్య స్నేహపూర్వకమైన వాతావరణం ఉన్నప్పుడే విశ్వవిద్యాలయాలు విద్యా విజ్ఞాన వికాస కేంద్రాలుగా నిలుస్తాయని ఆకాంక్షించారు. విద్యార్థులు వీసీని కలిసేందుకు అడ్డుగా ఉన్న బారికేడ్లు, దిగ్బంధనాల రోజులు పోయాయని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినాక విశ్వవిద్యాలయాల్లోనూ నిజమైన మార్పు ప్రారంభమైందని తెలిపారు.

రైతులకు రుణమాఫీ చేయాలి: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతులకు రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ మేరకు శుక్రవారం ఎక్స్‌లో ఆమె ట్వీట్ చేస్తూ, దాదాపు రూ.2,45,554 రుణం ప్రతి రైతు నెత్తి మీద కత్తిలా వేలాడుతోందన్నారు. గడచిన దశాబ్దంలో అటు కరవు రావడం, ప్రాజెక్టులు పూర్తికాకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం సర్వనాశనం అయిందని, డబుల్ ఇంజిన్ సర్కారు నడుపుతున్న మీరు, కేంద్ర సాయంతో ఎందుకు రుణమాఫీ చేయకూడదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే, రూ.రెండు లక్షల రుణమాఫీ, ఇచ్చిన మాట ప్రకారం కచ్చితంగా చేసి ఉండేదన్నారు. 15 ఏళ్ల క్రితం, ఒకే దఫాలో దేశవ్యాప్తంగా రుణమాఫీ చేసి అన్నదాత పట్ల ప్రేమ, వ్యవసాయం పట్ల నిబద్ధతను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చూపిందని గుర్తుచేశారు. మళ్లీ నిన్న తెలంగాణలో రేవంత్‌రెడ్డి సారథ్యంలో, సోనియా, రాహుల్‌గాంధీ ఆలోచన, ఆదర్శాలకు అనుగుణంగా, ఇంకెప్పుడు అని వెక్కిరించే నోళ్లు మూయిస్తూ, కాంగ్రెస్ సర్కారు అందించిన రైతు రుణమాఫీ వరం చరిత్ర గర్వించే రోజు అని తెలిపారు. రైతు కళ్లల్లో ఆనందం తిరిగి తీసుకువచ్చే క్షణమని, ఇది రాహుల్ గాంధీ ఎన్నికల వేళ చేసిన వాగ్దానం సాకారమైన రోజు అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ సర్కారుకు ఆమె అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు రుణమాఫీ అమలుకు చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

తహసీల్దార్ల బదిలీ హర్షణీయం

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.రమేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయినందున గత సంప్రదాయం ప్రకారం ఎన్నికల నిర్వహణ కోసం బదిలీ అయిన తహశీల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాల్సి ఉందని, తమ విజ్ఞప్తి మేరకు ఎన్నికల సంఘం, ఆర్థిక శాఖల అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్ల పునఃబదిలీకి ఉత్తర్వులు మంజూరు చేశాసిందని ఆయన తెలిపారు. ఈ బదిలీల్లో కీలకపాత్ర పోషించిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, సీఎం చంద్రబాబుకు, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

గ్రేడ్ 2 వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పని చేస్తున్న గ్రేడ్ 2 వీఆర్వోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్ర ప్రదేశ్ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సిసోడియాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్ ప్రమోషన్, వన్‌టైం సెటిల్‌మెంట్, రేషియో పెంపు, వీఆర్వోలు అందరికీ కామన్ డీడీఓగా తహసీల్దార్ నియామక పత్రం, గ్రేడ్ 2 వీఆర్వోల పదోన్నతులపై వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సిసోడియా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, ప్రచార కార్యదర్శి ఎం.బాపూజీ, కార్యనిర్వహణ కార్యదర్శి చైతన్య, సంఘం కృష్ణాజిల్లా నాయకులు అర్జున్‌రావు, నళిని, కడప, చిత్తూరు జిల్లాల నేతలు దేవానందం, బాలాజీరెడ్డి, హనుమంతు, రమేశ్ పాల్గొన్నారు.

పొందూరు ఖాదీపై వీడియో పోటీలు

- చేనేత శాఖ కమిషనర్ శ్రీకాంత్ ప్రభాకర్

విశాలాంధ్ర-విజయవాడ: ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పొందూరు ఖాదీ తయారీపై వీడియో పోటీలు నిర్వహిస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో పాల్గొనదలచినవారు పొందూరు ఖాదీ వస్త్ర తయారీలోని అన్ని దశలను పొందుపరుస్తూ చక్కటి వీడియోను రూపొందించాలన్నారు. ఉత్తమ వీడియోకు నగదు పారితోషకం, ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరిస్తామన్నారు. ఉత్సాహవంతులు ఇతర వివరాలకు చేనేత శాఖ సహాయ సంచాకులు పి.శ్రీనివాస రెడ్డిని 9492344466 ఫోన్ నంబరులోగానీ, గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్ 4వ అంతస్తులోని కమిషనర్ కార్యాలయంలో ఈ నెల 26లోగా సంప్రదించాలని సూచించారు. రూపొందించిన వీడియోలను ఆగస్టు 1వ తేదీలోగా సమర్పించాలని కోరారు. శ్రీకాకుళానికి 25 కి.మీ.ల దూరంలోని పొందూరు గ్రామంలో తయారయ్యే ఈ ఖాదీ మహాత్మా గాంధీని ఎంతగానో ప్రభావితం చేసిందని, నేటికీ ప్రసిద్ధి పొందుతుందని తెలిపారు. భారతదేశ చరిత్రలో చేనేత ప్రాధాన్యతకు గుర్తింపుగా 2015 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో చైతన్యం రగిలించడమే కాక స్వదేశీ వస్తు ఉద్యమంలో కూడా చేనేత వస్త్ర ఉత్పత్తి కీలక పాత్ర పోషించిందని వివరించారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో అంతులేని అవినీతి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఎన్డీఏ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని, బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారుల పోస్టింగులకు మంత్రులు రూ.5 కోట్లకు బేరం పెట్టి పోస్టింగులు ఇస్తున్నారని, చరిత్రలో ఎక్కడా జరగని విధంగా అవినీతిని ప్రోత్సహిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ తాము అవినీతికి వ్యతిరేకంగా పనిచేస్తున్నామని గొప్పలు చెబుతున్నారని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత యూపీఎస్సీ అంటే నీతినిజాయితీలకు మారుపేరని, అటువంటి దానిలో కూడా అవినీతి మరక రావటానికి బీజేపీ అవినీతికి నిదర్శనమన్నారు. నిరుద్యోగం, వలసల నివారణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నుంచి వలసలు అధికంగా ఉన్నాయని, ప్రతిరోజూ కుప్పం వాసులు వేల మంది బతుకుదెరువు కోసం కర్నాటక వెళుతున్నారని అన్నారు. మదనపల్లెలో టమాటా ఎక్కువ పండిస్తారని, అక్కడే కిలో టమాటా రూ.100 కి అమ్ముతున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజలు ఏమి తినాలి, ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను స్థిరీకరించలేకపోతున్నాయన్నారు. పోలవరంపై ఇప్పటి వరకు ఎంత ఖర్చు ఎంత అయిందో జ్యుడీషియల్ విచారణ చేయాలని కోరారు. జగన్ రాష్ట్రానికి చేసిన ఘనమైన పని రూ.14 లక్షల కోట్ల అప్పులని, అన్ని లక్షల కోట్లు ఏమయ్యాయి? ఏమన్నా అభివృద్ధి పనులు చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి మంచి అవకాశం వచ్చిందని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఈ ఐదేళ్లలో సాధించుకోవాలన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలవరం, అమరావతి నిర్మాణం ఎలా పూర్తి చేస్తారో వేచి చూడాలని చింతా మోహన్ తెలిపారు.

ఉపాధ్యాయ, కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు లక్ష్మన్న కన్నుమూత

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: విశ్రాంత ఉపాధ్యాయుడు, సీపీఐ సీనియర్ నేత పీ లక్ష్మన్న (93) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తన స్వగ్రామం అనంతపురం జిల్లా కుందుర్పిలో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం 11.10 గంటల సమయంలో లక్ష్మన్న తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. లక్ష్మన్న కు భార్య పార్వతమ్మ, కుమారుడు రాధాకృష్ణరాజు (టీచర్) కుమార్తెలు అరుణ, విజయలక్ష్మి, వాణిశ్రీ, శ్యామల కుమారి ఉన్నారు. వీరిలో ముగ్గురు ఉపాధ్యాయులు కాగా ఒక కుమార్తె ఎంబీబీఎస్ డాక్టర్‌గా బెంగళూరు రామయ్య హాస్పిటల్ లో పనిచేస్తున్నారు. లక్ష్మన్న అంత్యక్రియలు శనివారం ఉదయం కుందుర్పిలో జరుగుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సంజీవప్ప తెలిపారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకైన పాత్ర: లక్ష్మన్న ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. పార్టీ అనుబంధ సంస్థ ఎస్టీయూలో సభ్యత్వం తీసుకొని ఉపాధ్యాయ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారు. నియోజకవర్గంలో ఎంతో మంది ఉపాధ్యాయులను పార్టీ సానుభూతిపరులుగా మార్చారు. ఉపాధ్యాయ ఉద్యమంతో పాటు సీపీఐ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలు, ఆర్థిక సహాయ సహకారాలు అందించేవారు. కామ్రేడ్ లక్ష్మన్న భార్య పార్వతమ్మ మహిళా సమాఖ్య నాయకురాలుగా పనిచేస్తూ నేటికీ ఉద్యమంలో పాల్గొంటున్నారు. వృత్తిరీత్యా అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్న లక్ష్మన్న తుది శ్వాస వదిలేదాక కమ్యూనిస్టు పార్టీ జెండాను వదలకుండా కుటుంబం అంతా పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నారు.

ఎంపీటీసీగా విజయం: ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా రిటైర్ అయిన తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించిన లక్ష్మన్న సీపీఐ తరపున కుందుర్పిలో ఎంపీటీసీగా గెలుపొందారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పేదలకు అందేలా చేయడంలో తన వంతు పాత్ర పోషించారు. ఎంబీబీఎస్ చదడానికి లక్ష్మన్న కుమార్తె అరుణను సీపీఐ రష్యాకి పంపింది. సీపీఐ దాని అనుబంధ సంస్థలైన ఏఐఎస్ఎఫ్, యువజన సమాఖ్య, మహిళా సమాఖ్య , ప్రజనాట్య మండలి, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం బలోపేతానికి సహాయ సహకారాలు అందిస్తూ నియోజకవర్గంలో పెద్దన్న పాత్ర పోషించారు లక్ష్మన్న.

నివాళులర్పించిన జగదీశ్: లక్ష్మన్న మృతి చెందారన్న సమాచారం తెలిసిన వెంటనే పెద్ద సంఖ్యలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు కుందుర్పిలోని ఆయన స్వగృహానికి వెళ్లి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీనియర్ నాయకుడు ఎంవీ రమణ, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు లాయర్ సంజీవప్ప, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శులు వై.గోపాల్, మహాదేవప్ప, పార్టీ నాయకులు మహాదేవ్, పి.గిరిజ, రాందాసు, నరసింహులు,తిరుపాల్, మురళి,నాగరాజు, అంజనేయులు, ఓంకార్ తదితరులు సంతాపం తెలిపారు.

నిజాయితీ, నిబద్ధతకు మారుపేరు లక్ష్మన్న: రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం జిల్లా సీపీఐ సీనియర్ నేత, ఎస్టీయూ నాయకులు పి.లక్ష్మన్న మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. సీపీఐ అనంతపురం జిల్లా సీనియర్ నాయకులుగా, స్టేట్ టీచర్స్ యూనియన్ నాయకులుగా లక్ష్మన్న తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారన్నారు. ఉపాధ్యాయునిగా, రాజకీయనేతగా నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా, నిబద్ధతకు మారుపేరుగా ఆయన నిలిచారన్నారు. కుందుర్పి మండలంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి లక్ష్మన్న ఎంతగానో కృషి చేశారన్నారు. లక్ష్మన్న మరణం పట్ల సీపీఐ రాష్ట్ర సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

త్వరలో టిడ్కో గృహాలు అందిస్తాం

మహిళా మార్ట్‌కు మంత్రి భరత్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: టిడ్కో ఇళ్లకు త్వరలో మౌలిక సదుపాయాలు సమకూర్చి పేదలకు అందజేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగర శివార్లలోని జగన్నాథ గట్టుపై పీఎంఏవై(అర్బన్) టీడ్కో కాలనీలో రూ.1.38 కోట్లతో నిర్మించనున్న మహిళా మార్ట్ నిర్మాణానికి శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం భరత్ మాట్లాడుతూ పేదలకు నివాసాలు కల్పించాలనే ఉద్దేశంతో గతంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా టీడ్కో గృహ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. కేవలం చంద్రబాబుకు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. టిడ్కో గృహాల కోసం లబ్దిదారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. చివరి దశలో ఉన్న ఈ గృహాలను త్వరలో అన్ని మౌలిక వసతులతో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మహిళా మార్ట్ ద్వారా టిడ్కో నివాసితులకు రీజనబుల్ ధరలకే సరుకులు లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు నగరానికి తలమానికమైన ఈ గృహాలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే అని అన్నారు. గృహాలలో ప్రస్తుతం 50 కుటుంబాలు నివాసం ఉన్నాయని, వీరికి మౌలిక వసతులు కూడా కల్పించామని చెప్పారు. కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కలెక్టర్ రంజిత్‌బాష , మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఏపీ టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, డీఈలు హరికృష్ణ, రవికుమార్ గుప్త, పవన్ కుమార్, ఏఈలు కౌశియా, వినాయక్, మహిళా మండలి అధ్యక్షురాలు ముంతాజ్, గౌసియా పాల్గొన్నారు.

15 మంది గంజాయి విక్రేతల అరెస్ట్

90 కేజీల స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్ట్ చేసినట్టు డీసీపీ హరికృష్ణ తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డీజీపీ ద్వారక తిరుమలరావు ఆదేశాల మేరకు సీపీ శేఖరబాబు పర్యవేక్షణలో గంజాయిపై 100 రోజుల యాక్షన్ ప్లాన్ నిర్వహించినట్టు చెప్పారు. సిటీ టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు సంబంధించిన సమాచారాన్ని సేకరించి మాదకద్రవ్యాల కేసుల్లో అరెస్ట్ కాకుండా తప్పించుకుని తిరుగుతున్న 15 మందిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. పింకీ రౌత్ (49), గోగినేని మాధవరరావు (25), మురుగున్ మణికంత, గణేశ్, షేక్ మహమ్మద్ గౌస్ (27), అబ్దుల్ హబీబ్ (24), రఘురాం (31), రాకేశ్ (24), మమత (25), సుల్తాన్ (22), నజీర్ (25), నాని (28), మధుసుధన్‌రెడ్డి (29), ఆడపాల వంశీ (23), అమన్‌సింగ్ (21)లను వివిధ స్టేషన్‌ల పరిధిలో అరెస్టు చేసినట్టు వివరించారు. వారి వద్ద నుంచి 90.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరంతా గంజాయికి అలవాటు పడి వేర్వేరు మార్గాల ద్వారా గంజాయి రవాణా చేసి యువకులకు గంజాయి విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలకు అలవాటు పడ్డారన్నారు. గంజాయి సరఫరాలో కీలకంగా వ్యవహరించే ఒడిశాకు చెందిన పింకీ రౌత్ బరంపూర్ సమీపంలోని పూల్బానీ ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్టు తెలిసిందన్నారు. కేజీల ప్యాకెట్లు తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విజయవాడ పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు చేస్తున్నారన్నారు. ఈ కేసుల్లో మరికొంత మంది పరారీలో ఉన్నారని, వీరితో పాటు పింకి రౌత్‌తో సంబంధాలు కలిగిన వారిపై నిఘా పెట్టడం జరిగిందని డీసీపీ తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే 91211 62475 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు పాల్గొన్నారు.

'నేరడి' నిర్మాణంపై ఒడిశా ప్రభుత్వంతో చర్చించాలి

మంత్రి నిమ్మలకు విశ్రాంత ఐఏఎస్ ఈఏఎస్ శర్మ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వంశధార నదిపై నేరడి రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు లేఖ రాశారు. ఒడిశా లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున రాష్ట్రంలో కూడా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఉన్నందున ఈ విషయమై ఒడిశాతో ఉన్న ఇబ్బందులపై చర్చించి పరిష్కరించుకోవడం ద్వారా నేరడి రిజర్వాయర్ నిర్మాణం త్వరితగత పూర్తి చేయాలని లేఖలో కోరారు. అనేక సాంకేతిక సమస్యల గురించి లేఖలో తెలియజేశారు. వంశధారలో లభ్యమయ్యే 115 టీఎంసీల జలాల్లో రాష్ట్రానికి 50 శాతం వాటా అంటే 57.5 టీఎంసీలు రావాలి. ఆ నీటి వాటాను ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో నేరడి రిజర్వాయిర్ నిర్మిస్తే కానీ పూర్తిగా ఉపయోగించుకోలేము. సుప్రీం కోర్టు నియమించిన ట్రిబ్యునల్, నేరేడు నిర్మాణం విషయంలో మన రాష్ట్రానికి కావాల్సిన అనుమతులు ఇచ్చినా... ఒడిశా ప్రభుత్వం మూడు కేసుల ద్వారా సుప్రీంకోర్టును ఆశ్రయించడం వల్ల నేరడి నిర్మాణం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇందులో గొట్టాబ్యారేజి వద్ద నిర్మించిన ఎడమ కాలువ ద్వారా 17.8 టీఎంసీలు, కుడి కాలువ ప్రాజెక్టు, సింగిడి, పారాపురం, హిరమండలం రిజర్వాయర్ల ద్వారా 16.1 టీఎంసీలు నీరు, మన రాష్ట్రం ఉపయోగించుకోవచ్చు. ఇంకా 23.6 టీఎంసీల నీటిని రాష్ట్రం నేరడి ప్రాజెక్టు ద్వారా ఉపయోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఒడిశాలో అధికారం చేపట్టడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీజేపీ కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్నందున కోర్టుల కన్నా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవడానికి ఇదే మంచి సమయమని శర్మ సూచించారు.

అల్లరి మానండి... లేకుంటే చచ్చిపోతా

పిల్లలను బెదిరించబోయి మృత్యు ఒడిలోకి ఓ తండ్రి



విశాలాంధ్ర-గోపాలపట్నం (విశాఖ): మీరు అల్లరి మానం డి... లేకుంటే నేను చచ్చిపోతా.... అంటూ అల్లరి చేస్తున్న పిల్లలను బెదిరించే క్రమంలో ఓ తండ్రి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. దీంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలోకి వెళ్లిపోయింది. ఈ ఘటన విశాఖపట్నం నగర పరిధిలోని గోపాలపట్నం కొత్తపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలివి. బీహార్‌కు చెందిన చందన్ కుమార్ (33) రైల్వేలో లోకో పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుమార్తె (7), కుమారుడు(5) ఆయన చొక్కా జేబులోని కరెన్సీ నోట్లను తీసి చించేశారు. పిల్లలపై చిరాకు పడుతున్న చందన్‌కుమార్‌కు భార్య అడ్డుపడింది. దీంతో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవైంది. ఈ క్రమంలో భార్య, పిల్లల ముందే ఇంట్లో ఫ్యాన్‌కు చీరకట్టి మెడకు చుట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ చందన్ కుమార్ వారిని భయపట్టే ప్రయత్నం చేశాడు. పొరబాటున చీర బిగుసుకోవడంతో అతడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అయితే తమను బెదిరించే క్రమంలో చందన్‌కుమార్ అలా నటిస్తున్నాడని తొలుత ఆమె భావించింది. కానీ అతడు ఉలుకుపలుకు లేకుండా ఉండేసరికి భార్యకు విషయం అర్థమైంది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న భర్తను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చందన్ కుమార్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు సేకరించి, పోస్ట్‌మార్టం నిమిత్తం అతడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ ప్రకటన

"ఆంధ్ర రాజ్య సంఘ్ పార్టీ" (పార్టీ పేరు) పేరుతో రాజకీయ పార్టీని రిజిస్టర్ చేయాలని ప్రతిపాదించడం జరిగినందున సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

పార్టీ కార్యాలయం : నెం.6-240, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ -522 016. (పూర్తి చిరునామా). ఈ పార్టీ, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఎ ప్రకారం రాజకీయ పార్టీగా నమోదు కోసం భారత ఎన్నికల సంఘం, న్యూఢిల్లీకి దరఖాస్తును సమర్పించింది. పార్టీ ఆఫీస్ బేరర్ల పేర్లు/ చిరునామా క్రింది విధంగా ఉన్నాయి:

ప్రెసిడెంట్ : శ్రీ జంజనం కోటేశ్వర రావు, నివాసం : ఇంటి నెం.6-240, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 016.

వైస్ ప్రెసిడెంట్ : శ్రీమతి జంజనం పద్మ, నివాసం : ఇంటి నెం.6-240, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 016.

జనరల్ సెక్రటరీ : శ్రీ చిల్లపల్లి గోపి, నివాసం :6-248, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 016.

జాయింట్ సెక్రటరీ : శ్రీ గోలి వెంకటేశ్వర రావు, నివాసం : ఇంటి నెం.6-193/ఎ, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 016.

ట్రెజరర్ : శ్రీమతి అమర్లపూడి శ్యామల, నివాసం : ఇంటి నెం.1-280, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522 016.

అసిస్టెంట్ ట్రెజరర్ : శ్రీ పొట్లూరి పీటర్ పాల్, నివాసం : ఇంటి నెం.1-71, నిడుముక్కల గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522016.

"ఆంధ్ర రాజ్య సంఘ్ పార్టీ" (ప్రతిపాదిత పార్టీ పేరు) నమోదుపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వారు తమ అభ్యంతరాన్ని కారణాలతో సహా, కార్యదర్శి (రాజకీయ పార్టీ), భారత ఎన్నికల సంఘం, నిర్వాచన్ సదన్, అశోకా రోడ్, న్యూఢిల్లీ-110001 కి ఈ నోటీసును ప్రచురించిన 30 రోజులలోపు తెలియజేయవలెను.

సంపాదకీయం

పి.ఎం. కేర్స్ మాయ

పి.ఎం.కేర్స్ నిధి గురించి విని కనీసం మూడేళ్లు అయి ఉంటుంది. ఎన్నికల బాండ్ల మీద జరిగినంత రగడ పి.ఎం.కేర్స్ నిధి మీద జరగలేదు. కరోనా మహమ్మారి ప్రపంచమంతటినీ కబళించినప్పుడు ఈ వ్యాధి సోకిన తల్లిదండ్రులు, లేదా వారిలో ఎవరో ఒకరు మరణించిన బాలలకు సహాయం అందించడం కోసం ఘనత వహించిన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2021 మే 29న పి.ఎం.కేర్స్ నిధి ఏర్పాటు చేశారు. వివిధ సహాయ కార్యక్రమాలకు అవసరమైన డబ్బు సమకూర్చుకోవడానికి చాలా కాలం నుంచి మనకు ప్రధానమంత్రి సహాయ నిధి ఉంది. దీనికి ఎవరైనా, ఎంత మొత్తంలోనైనా విరాళాలు ఇవ్వొచ్చు. కరోనా వ్యాధి సోకినప్పుడు బాధితులను ఆదుకోవడానికి ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి డబ్బు వాడుకోకూడదన్న నియమం ఏమీ లేదు. కరోనా వ్యాధి కొత్తగా ప్రచారంలోకి వచ్చిన పేరు కావచ్చు. కానీ ఇబ్బందుల్లో ఉన్న సమయాల్లో జనాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఆదుకునే పద్ధతి ఎప్పటి నుంచో అమలులో ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పి.ఎం.కేర్స్ నిధిని ఏర్పాటు చేశారు. కరోనా సోకి తల్లిదండ్రులు మరణిస్తే వారి పిల్లలను ఆదుకోవడానికి నిధులు సమకూర్చడం ఈ నిధి ఉద్దేశం అని చెప్పారు. చాలా మంది ఉదారంగానే నిధులు అందజేశారు. కానీ ఈ నిధులు ఎలా వెచ్చిస్తున్నారో మాత్రం చెప్పరట. జనం ఇచ్చిన విరాళాలు జన సంక్షేమంకోసం కోసం ఖర్చు పెట్టడం ప్రభుత్వ ఉద్దేశం అయినప్పుడు వెచ్చించిన నిధుల వివరాలు ఎందుకు రహస్యంగా ఉంచాలో తెలియదు. గోప్యత మోదీ విధానం అని సరిపెట్టుకోవలసిందే. తీరా ఈ నిధులు ఎలా ఖర్చయ్యాయి, ఈ నిధి కింద సహాయం కోరిన వారికి ఏ మాత్రం సాయం అందిందో కూడా ఇప్పటి దాకా రహస్యమే. ఈ నిధుల కోసం అందిన దరఖాస్తుల్లో 51 శాతం తిరస్కరించారట. కారణం మాత్రం చెప్పలేదు. కరోనా బారినపడి తల్లిదండ్రులిద్దరిని, లేదా తల్లినో తండ్రినో, సంరక్షకుడినో కోల్పోయిన పిల్లలను ఆదుకోవడం ఈ నిధి ప్రధాన ఉద్దేశం. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిసి మొత్తం 33 ఉన్నాయి. వీటి నుంచి పి.ఎం.కేర్స్ నిధి కింద సహాయం కోసం మొత్తం 9,331 దరఖాస్తులు అందాయని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయ్. 613 జిల్లాల నుంచి అభ్యర్థనలు అందాయట. కానీ 558 జిల్లాలకు చెందిన 4,532 దరఖాస్తుదార్లకే సహాయం అందించారని, మిగతా 4,718 దరఖాస్తులను తిరస్కరించారని, మరో 18 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని అధికారిక సమాచారం. ఏ కారణంవల్ల దరఖాస్తులను తిరస్కరించారో మాత్రం అధికారిక సమాచారం ఏదీ లేదు. ఈ నిధి నిర్వహణ బాధ్యుల్లో ప్రభుత్వ పెద్దలే ఉన్నారు. కానీ ఇది ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధి కాదంటున్నారు. అయితే ఆమోదానికి, తిరస్కరణకు సంబంధించిన సమాచారం అందజేసింది మాత్రం కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖే. ఈ నిధి కింద సహాయం కోసం ఎక్కువగా రాజస్థాన్ నుంచి 1,553, మహారాష్ట్ర నుంచి 1,522, ఉత్తరప్రదేశ్ నుంచి 1,007 దరఖాస్తులు అందాయంటున్నారు. కానీ రాజస్థాన్ నుంచి అందిన 210 దరఖాస్తులను, మహారాష్ట్ర నుంచి 855 దరఖాస్తులను, ఉత్తరప్రదేశ్ నుంచి 467 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారట. దరఖాస్తులను ఆమోదించారంటే సహాయం అందించారనే అనుకుందాం. కరోనాలో తల్లిదండ్రులనో, సంరక్షకులనో కోల్పోయిన వారికి సమగ్రమైన, దీర్ఘకాలిక సహాయం అందించడం ఈ పథకం లక్ష్యం. అంటే బాధిత బాలలకు ఆరోగ్య బీమా, విద్యా సదుపాయం, ఆర్థిక సాయం అందిస్తారు. లక్ష్యం ఎప్పుడూ దొడ్డగానే ఉంటుంది కనక బాధిత బాలలు 23 ఏళ్లకు చేరుకునే దాకా ఈ సదుపాయాలన్నీ కల్పించాలని అనుకున్నారు.

గత మూడేళ్ల కాలంలో కేవలం విదేశాల నుంచి అందిన నిధులే రూ.535 కోట్లు. 2019-20లో రూ. 3,076 కోట్లు అందాయి. 2020-21 నాటికి ఈ నిధి రూ. 10,9902 కోట్లకు పెరిగింది. 2021-22లో మాత్రం ఈ నిధి రూ.9,131.9 కోట్లకు తగ్గింది. కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యత కోసం ప్రత్యేకించిన మొత్తం నుంచి అందించిన విరాళాలే ఎక్కువ. అందిన మొత్తం నిధుల్లో ప్రభుత్వం నిర్వహించే సంస్థలు అందించిందే 59.3 శాతం ఉంది. ఈ నిధికి అధినేత ప్రధాన మంత్రి అన్నారు. అయితే ఇది ప్రభుత్వంతో సంబంధం లేనిదట. ఈ నిధి ప్రభుత్వ వ్యవస్థ కాదట. ఈ నిధి నిర్వాహకుల్లో ప్రధాని మాత్రమే కాదు, కొందరు కేంద్ర మంత్రులూ ఉన్నారు. వారు వ్యక్తిగత హోదాలో ఈ నిధి నిర్వహించిన దాఖలాలు లేవు. అంతా అధికార హోదాలోనే జరిగింది. అయినా ప్రభుత్వంతో ఆ నిధికి సంబంధం లేదట. వాదన విచిత్రంగా ఉందికదా! మోదీ హయాంలో ఏదైనా సాధ్యమే కదా! ప్రధానమంత్రిని ప్రసన్నుడిని చేసుకోవడం కోసం కార్పొరేట్ సంస్థలు కూడా ఉదారంగానే ఈ నిధికి డబ్బు అందించాయి. కరోనా విజృంభించినప్పుడు జరిగిన అవకతవకలకు లెక్కే లేదు. ఆ సమయంలో అత్యవసరమైన వెంటిలేటర్లు సిద్ధంచేసి పంపిన సంస్థలూ ఉన్నాయి. అందులో చాలాభాగం పని చేయలేదు. వెంటిలేటర్లు తయారు చేయడానికి ఉద్దేశించిన కాంట్రాక్టు షరా మామూలుగా గుజరాత్‌కే దక్కింది. ఆ వెంటిలేటర్ల నాణ్యతా నాసిరకమే. కరోనా వెనకపట్టు పట్టిన తరవాత పి.ఎం.కేర్స్ నిధి గురించి ప్రస్తావనే రాలేదు. కరోనా సమయంలో పిల్లల బాగోగులు చూసే బాధ్యత ఉన్న తల్లిదండ్రులే కాదు అనేక రకాల సంరక్షకులు కూడా మృతి చెందారు. కొన్ని ఇళ్లల్లో తల్లిదండ్రులిద్దరూ మరణిస్తే పిల్లలు మాత్రమే మిగిలారు. తల్లిదండ్రుల్లో ఒక్కరే మిగిలిన ఉదంతాలూ ఉన్నాయి. మరి కొన్ని చోట్ల తాతో, అమ్మమ్మో, నానమ్మో పిల్లలను చూస్తూ ఉంటే వారు కరోనా బారినపడి మరణించడం వల్ల పిల్లలు నిరాధారంగా మిగిలిపోయారు. ఇంకొన్ని సందర్భాలలో దత్తత తీసుకున్న వారూ మరణించారు. వెరసి వేలాదిమంది బాలలు ఏ ఆధారమూ లేకుండా మిగిలారు. వీరిని ఆదుకోవడానికే పి.ఎం.కేర్స్ నిధి ఏర్పడింది. అలాంటప్పుడు సగం కన్నా దరఖాస్తులను తిరస్కరించడం ఆశ్చర్యంగా ఉంది. తిరస్కరించవలసిన పరిస్థితే వస్తే కారణం చెప్పాల్సిన బాధ్యత నిధి నిర్వాహకులకు ఉంటుందిగా. మహిళా శిశు సంక్షేమ శాఖ అందించిన వివరాల ప్రకారమే ఆమోదంపొందిన దరఖాస్తుదార్ల బాగోగులు 23 ఏళ్ల దాకా చూసినా వెయ్యి కోట్ల రూపాయల కన్నా ఎక్కువ అవసరం ఉండదు. మిగిలే నిధులు భారీగానే కనిపిస్తున్నాయి. ఆ సొమ్ము ఎక్కడికి పోతోంది? ఆ లెక్కలు ఎవరు చెప్తారు. ప్రధాని ఎటూ చెప్పరు. ఈ నిధిలో భాగస్వాములైన కొందరు మంత్రులు స్వతంత్రంగా మాట్లాడలేని దీన స్థితిలో ఉన్నారు. అంటే వాస్తవాలు చాప కిందకు తోసేస్తారనేగా.

ఉపవాస "రాజకీయ" పద్యాలు

మహ్మద్ యూసుఫ్ ఖాన్ తెలుసా...! అతనో ప్రఖ్యాత నటుడని ఎరుక ఉందా..! బాలీవుడ్‌ని ఏలిన నటుడు ఈ ఖాన్ అని ఎంత మందికి జ్ఞప్తికి ఉంది. బహుశా ఈ యూసుఫ్ ఖాన్ గురించి తెలుసుకునే అవకాశం కూడా ఉండకపోవచ్చు. ఎందుకంటే ఈ ఖాన్ తన పేరు దిలీప్ కుమార్‌గా మార్చుకుని అలనాటి బాలీవుడ్‌ని, ప్రపంచ సినిమా అభిమానులను తన చుట్టూ తిప్పుకున్నారు. అలాగే ముంతాజ్ జహాన్ బేగం అంత అందగత్తె, గొప్పనటి అని ఊహించుకుంటామా....! ఈమె మధుబాల కదూ అంటే అవాక్కవుతాం. మరో నటి మహె జబీన్ కూడా ఇలాంటి నటే. కాకపోతే పేరు మాత్రం మార్చుకుని "నన్ను మీనా కుమారి అని పిలవరూ" అంటూ బాలీవుడ్‌ని అభ్యర్థించింది. ఈ ముస్లిం మహానటీ, నటులందరూ తమ పేర్లను మార్చుకుంటే కాని తెరమీద ఓ వెలుగు వెలగలేకపోయిన కాలం అది. కాని నేడు ఆ పరిస్థితి లేదు. షారూక్ ఖాన్, అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తమ సొంత పేర్లతోనే నటిస్తున్నారనే లౌకిక వాదంలోకి వచ్చామని ఆనందపడి పోతున్నాం. అంతెందుకు ఈ ఉపవాస "రాజకీయ" పద్యాలు రాసిన బోల్డు పెద్ద కవి

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

అఫ్సర్ నాన్న, కౌముది పేరుతో మంచి కవిత్వం రాసినాయన అసలు పేరు షంషుద్దీన్. ఈయనకు అంటని లౌకిక వాద ఛాయలు నేటి కవి అఫ్సర్‌కి దక్కాయి. ఇదియునూ సర్వమానవ సౌభాతృత్వమే మానవా..!

ఈ సెక్యులర్ దేశంలో, పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస వేళల్లో ...

"రాజకీయ ఇఫ్తార్ విందులో
వందల రకాల వంటకాలు పోటీ పడతాయి
ఒక బస్తీలో అడుగుపెడతానా-
అంతటా ఖాళీపళ్లాలు
ఆకలి ముఖాలే దర్శనమిస్తాయి"

అంటున్నాడు ఈ అఫ్సర్ అనే ముస్లిం కవి తన ఉపవాస పద్యాల్లో..
ఇంతే కాదు...

" ఈదురుగాలులకు ఎదురొడ్డి
ఈ ఉదయమిక్కడ
ఒంటిగా నిలుచున్నాను
నా అంతరంగాన్ని నివేదించి
ఇక్కడ-

వందసార్లు చచ్చిబతికాను" అంటూ పండుగ వేళల్లో భోరున విలపిస్తున్నాడు. ఇది చదివినప్పుడు ఇవి కేవలం ఉపవాస పద్యాలే అని ఎలా అనుకుంటాం. ఎందుకనుకుంటాం. కచ్చితంగా తన చుట్టూ తిరుగుతున్న, తనకు తెలియకుండా తనని ఓ ప్రధాన సూత్రధారిగా చేసిన రాజకీయ పద్యాలుగానే చూస్తాం కదా. చూడాలి కదా.

అఫ్సర్ తన చుట్టూ పెనవేసుకుపోయిన రాజకీయాలను ప్రపంచం మీదకి కూడా తీసుకుపోయాడు. రంజాన్ ఉపవాస దీక్షలకు ప్రపంచమంతా వేదికే కదా. అందుకే తన పద్యాల విస్తృతిని ప్రపంచమంత పరిచాడు. ఎలా అంటారా... ఇదిగో ఇలా..

" పొద్దుటి ఆహారంలో
రొట్టెను తాకగానే-

ప్రతి తునకలోనూ గాజా కనిపిస్తోంది " అంటున్నాడు ఈ ఉపవాస పద్యాల్లో. నెలంటే ముప్పై రోజులే కదా. అందుకేనేమో 30 పద్యాలే రాశాడు అఫ్సర్. పద్యాల కోసం రంజాన్ రోజులు ఇంకా మరిన్ని ఉంటే బాగుండునని అనిపిస్తుంది. కాని ఆ రోజుల గాయాలు కూడా మోయాల్సి వస్తుంది. మనమూ గాయపడాల్సి వస్తుంది.

ఈ ఉపవాస పద్యాల ముందు మాటలో అఫ్సర్ "పలస్తీనా, ఈజిప్టు నుంచి అమెరికా వచ్చి, వాళ్ల కుటుంబాలకు దూరంగా రంజాన్ జరుపుకుంటున్న పద్దెనిమిది, ఇరవయేళ్ల వయసు వాళ్ల ముఖాల్లో నా అప్పటి ప్రతిబింబం కనిపించడం ప్రారంభమైంది". అంటాడు. నాకైతే ఆనాటి అఫ్సర్‌కు, నేడు అతనికి కనిపించిన వారి ముఖాలకు మధ్య చాలా తేడా ఉంది. కేవలం రంజాన్ మాత్రమే ఆ రెండు తరాలకు మధ్య మిగిలిన ఏకైక పోలిక. ఈ తరం తలలపై తిరుగుతున్న ప్రపంచవ్యాప్త యుద్ధ మేఘాలు, రక్తపుటేరులు, వేలాది మంది చిన్నారుల శవాల గుట్టలు అఫ్సర్ కళ్ల ముందు దీనంగా కూర్చున్న ఆ యువకుల్లో కనిపిస్తాయి. ఆ తరంలో తెల్లని నెలవంక కాన వచ్చింది. నేడు ఆ నెలవంకని ఎర్రగా మారుస్తున్న దృశ్యం ఆకాశంలోనే కాదు నేలపై కూడా తిరుగాడుతోంది. అలా తిరుగాడుతున్న ఫలితమే ఇదిగో ఈ ఉపవాస పద్యాలు. అవునూ, ఇంత గాయపరిచి, పుస్తకం ప్రతి పుట నుంచి కన్నీరు, రక్తపు మరకలను వేళ్లకి అంటుకునేలా రాసిన అఫ్సరూ, ఈ మధ్యనే డియర్ మేరీ అంటూ కథ రాసిన అఫ్సరూ ఒక్కరేనా... ! దేవుడి దయ వల్ల కాకపోతే బాగుండును.

సీనియర్ జర్నలిస్టు
సెల్: 99120 19929

సంపన్నులపై 2 శాతం పన్ను విధించాలి

నిత్య చక్రవర్తి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్పొరేట్ల అనుకూల ఆర్థిక విధానాల ఫలితంగా కార్మికుల నిజవేతనాలు వేగంగా తగ్గిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేర పేదరికం తగ్గుతోంది. బిలియనీర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మోదీ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటించడంలేదు. ఫలితంగా ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. భారీగా నిరుద్యోగ సమస్య నెలకొనివుంది. దీనివల్ల చదువుకున్న యువతలో తీవ్ర వ్యధ వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి మహిళలు ఎంతగానో కష్టాలపాలవుతున్నారు. మోదీ పదేళ్ల పాలనాకాలంలో సామాన్య ప్రజలకు ఏ మాత్రం మేలుచేకూర్చిన దాఖలాలులేవు. ఈ నేపథ్యంలో మరో మూడు రోజుల్లో జులై 23న మోదీ మూడవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత మొదటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తీవ్రమైన అనేక సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అత్యంత సంపన్నులపైన రెండుశాతం అదనంగా పన్ను విధిస్తేనే ఎక్కువ ఉద్యోగాలసృష్టి జరుగుతుంది. సామాన్యుల సమస్యలను తీర్చడానికి వీలువుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన తర్వాత ప్రవేశపెడుతున్న బడ్జెట్ ఇదే. అణగారిన వర్గాలలో జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ఈ బడ్జెట్ తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ రెండు ప్రధానమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. భారీ స్థాయిలో ఉద్యోగాలను సృష్టించాలి. తక్కువ ఆదాయాలు కలిగిన వర్గాల ప్రజలకు ఆదాయాన్ని పెంచాలి. ఈ రెండు సమస్యలను తీర్చడానికి గత దశాబ్దిలో అనుసరించిన విధానాలను విడనాడాలి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఇందులో భాగస్వాములవుతున్న వివిధ వర్గాలు, రంగాలు, పారిశ్రామిక వేత్తలతో చర్చలు జరిపారు. అన్ని సమావేశాల్లోనూ అదనపు వనరుల సమీకరణ ఎలా అన్నదే ప్రధాన ప్రశ్న. ఆర్థికవ్యవస్థను మెరుగుపరచాలంటే అత్యంత సంపన్నులు కొంత భారాన్ని వహించకతప్పదు.

అత్యంత సంపన్నులపై పన్ను విధించాలన్న ప్రతిపాదనను ప్రపంచస్థాయిలో చర్చిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 18, 19 తేదీలలో బ్రెజిల్‌లో జి-20 దేశాల శిఖరాగ్ర సమావేశం ఈ సమస్యను చర్చించనున్నది. ఈ ప్రతిపాదనను బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఆమోదించింది. ప్రధాని మోదీ ఈ ప్రతిపాదనపై మౌనం వహించారు. నవంబరులో జరగనున్న జి-20 సమావేశంలో మోదీ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఈ ప్రతిపాదన వచ్చినప్పుడు ఇండియా వైఖరిని తప్పనిసరిగా వెల్లడించవలసిఉంది. భారత సమాజంలో ఆర్థిక అసమానతలు వేగంగా పెరుగుతున్న దశ దిగువస్థాయి ప్రజలకు కూడా తెలిసిపోతుంది. బిలియనీర్లపై పన్ను విధించడానికి సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. ఇటీవల ముఖేశ్ అంబానీ తన కుమారుడి పెళ్లికి అత్యంత భారీగా ఖర్చుచేశారు. సంపన్నులు వివాహానికి ఏ విధంగా వివాహాలకు ఖర్చు చేస్తున్నారో అంబానీ ఇంట జరిగిన పెళ్లి మనకు తెలియజేస్తోంది. భారత్‌లో వివాహాలకు అత్యంత సంపన్నులు ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారు. ఇలా ఖర్చు చేస్తున్నవారిలో పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, చలనచిత్ర రంగానికి చెందిన కళాకారులు, అత్యంత సంపన్నులైన రాజకీయ వేత్తలు ఉన్నారు. వీరు వివాహానికి ఎంత ఖర్చు చేస్తున్నారో కచ్చితంగా తెలుసుకుని పరిమితికిమించి చేసే ఖర్చుపై పన్ను విధించాలని కొందరు చెప్తున్నారు. దేశంలో 167 మంది బిలియనీర్లు ఉన్నారని అంచనా. వీరి సంఖ్య అమితంగా పెరుగుతోంది. రెండు శాతం పన్ను అదనంగా విధిస్తే, కనీసం 1.5లక్షల కోట్లు సమీకరించవచ్చు. ఈ మొత్తాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు, ఉద్యోగాల కల్పనకు, కార్మికులను ఎక్కువగా వినియోగించే ప్రాజెక్టులకోసం ఖర్చుచేయాలి. ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ ప్రణబ్ బర్ధన్ అంచనా ప్రకారం, అదనపు వనరులను సమీకరించడానికి ప్రత్యక్ష, పరోక్ష సబ్సిడీలను తగ్గించాలి. అప్పుడు ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులు మెరుగ్గా ఉంటాయి. వారసత్వ సంపద మీద భారత్‌లో పన్నులు లేవు. అమెరికాతో పోల్చుకుంటే పెట్టుబడులపై వచ్చే ఆదాయంమీద పన్నులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుత పన్నుల విధానం సంపన్నులకు అనుకూలంగా ఉన్నది. కరోనా మహమ్మారి దేశాన్ని వణికించిన సందర్భంగా మోదీ ప్రభుత్వం కార్పొరేట్లపై పన్ను రేటును తగ్గించింది. ఫలితంగా ప్రభుత్వ ధనాగారం రూ.1.84 ట్రిలియన్లు కోల్పోయింది. కోవిడ్-19 వైరస్‌కు చిక్కి కార్మికులు విలవిలలాడారు. ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఎలాంటి సహాయం అందించలేదు. కార్మికులు, ఉద్యోగులు కోట్లాది ఉద్యోగాలను కోల్పోయారు. ఈ సందర్భంగా పేదరికం పెరిగింది. ఒక ట్రిలియన్ నిధులతో 20 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించవచ్చునని డాక్టర్ బర్ధన్ అంచనా వేశారు. దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా పన్నులు ఎగవేసిన కంపెనీలపైన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తప్పనిసరిగా అధ్యయనంచేసి ఉంటారని బర్ధన్ అన్నారు. 2003లో జరిగిన టాక్స్ జస్టిస్ నెట్‌వర్క్ ఆడ్వకసీ గ్రూపు అధ్యయనం ప్రకారం, ప్రపంచం 4.8 ట్రిలియన్ డాలర్లు కోల్పోతుందని అంచనా వచ్చింది. రానున్న దశాబ్ది కాలంలో పన్ను ఎగవేత వ్యక్తులు, సంస్థలు పైన తెలిపిన మేరకు ఆదాయం కోల్పోనున్నారు. పన్ను ఎగవేత వ్యక్తులు, సంస్థలను ప్రపంచస్థాయి కంపెనీలు ప్రోత్సహిస్తున్నాయి. వీరిలో అనేకమంది భారతదేశానికి చెందినవారు. ఈయూ టాక్స్ అబ్జర్వేటరీ ఈ సంవత్సరం అందించిన నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్లు 0-0.5 శాతం మధ్య తమ సంపదపై పన్ను చెల్లిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో పేదలు ఇంకా సామాన్యులు ఎనలేని కష్టాలకు లోనవ్వడమేగాక కోట్లాదిమంది ప్రపంచవ్యాప్తంగా మృతి చెందారు. ఇదే సమయంలో బడా కంపెనీలు, అత్యంత సంపన్నుల లాభాలు పెరిగాయి. ఈ మహమ్మారి వేధించిన సంవత్సరాలలో అసమానతలు అపారంగా పెరిగాయన్నది వాస్తవం.

ఆక్స్‌ఫామ్‌తో సహా ఇటీవల వివిధసంస్థల నుంచి వెలువడిన నివేదికల ప్రకారం, అత్యంత సంపన్నులపై పన్ను అదనంగా విధించడం ఎప్పుడో జరిగి ఉండవలసిందని అభిప్రాయ పడ్డారు. ఆక్స్‌ఫామ్ ఈ సంవత్సరం జనవరిలో తన నివేదికను విడుదల చేసింది. మహమ్మారి ఉన్న సంవత్సరాల్లోనూ ఆ తర్వాత సంవత్సరాల్లోనూ పేదలకు సామాజిక భద్రత లేకపోవడంతో అసమానతలు పెరిగాయి. సంపన్నులు, ఎగువ, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు పెరిగాయి. 2020 నుంచి ప్రపంచంలో అత్యధిక సంపన్నులైన ఐదుగురి సంపదలు రెట్టింపు పెరిగాయి. కరోనా మహమ్మారి సంవత్సరాలలో ప్రభుత్వ వైద్యరంగం బలహీనంగా ఉండటంతో ప్రైవేటు ఆసుపత్రుల ఆదాయాలు అపారంగా పెరిగాయి. ప్రైవేటు ఆసుపత్రులు 236 బలియన్ డాలర్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఈ పరిస్థితులను గమనించి మన కేంద్ర ప్రభుత్వం ఆర్థికవిధానాలను రూపొందించుకోవాలి.

మోదీ పాలనలో అప్పుల భారతం

ఎం కోటేశ్వరరావు

వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు మన వస్తు, సేవల ఎగుమతులు 800 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తాజాగా చెప్పారు. గత ఆర్థిక సంవత్సరలో 778.2 బిలియన్ డాలర్లు ఉన్నాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి మూడు మాసాలలో 200బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరిగినందున ఇదే ధోరణి మిగిలిన తొమ్మిది మాసాల్లో కూడా కొనసాగుతాయన్నది ఆశాభావం మాత్రమే. దిగుమతులు వెయ్యి బిలియన్ డాలర్లకు మించే ఉంటాయని కూడా చెప్పవచ్చు. గడచిన పది సంవత్సరాలలో ట్రైలర్ మాత్రమే చూపానని అసలైన సినిమా తరువాత ఉంటుందని నరేంద్రమోదీ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాధారణంగా సినీ ప్రేక్షకులను ట్రైలర్లతో ఆకట్టుకొనేందుకు చూస్తారు. ఈ రీత్యా చూసినప్పుడు ట్రైలర్ చూసిన తరువాత జనానికి నచ్చని కారణంగానే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సొంతంగా మెజారిటీని తెచ్చుకోలేకపోయారు. కూటమిగా కూడా నాలుగు వందల సీట్లకు చాలా దూరంలో ఉన్నారు. ఇక మోదీ ఫైల్స్ అనే సినిమాలో అనేక అంశాలు ఉన్నాయి. ముందుగా విదేశీ అప్పుల గురించి చూద్దాం.

మోదీ గద్దె నెక్కిన 2014లో మన విదేశీ అప్పులు 446.2బిలియన్ డాలర్లు. మోదీ కొత్త అప్పులు చేయలేదు, పాత అప్పులు తీర్చారంటూ భక్తులు గొప్పగా దైవాంశ సంభూతుడి మహిమల గురించి ప్రచారం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ 2024 మార్చినెలలో వెల్లడించిన సమాచారం ప్రకారం 2023 డిసెంబరు ఆఖరుకు 648.2బిలియన్ డాలర్ల విదేశీ అప్పు ఉంది. అంటే రెండు వందల బిలియన్ డాలర్లు పెరిగింది. పాత అప్పు తీర్చితే బకాయి తగ్గాలి, కానీ పెరిగిందంటే కొత్త అప్పులు చేసినట్లే కదా ! దీనికి బాధ్యులెవరు? మన విదేశీ మారక ద్రవ్య నిల్వ ప్రస్తుతం 657 బిలియన్ డాలర్లకు అటూ ఇటూగా ఉన్నాయి. ఇవి అప్పులకు సరిపోతాయి. మోదీ అధికారానికి వచ్చిన తొలి ఏడాది మన విదేశీ వాణిజ్య లోటు 137 బిలియన్ డాలర్లు కాగా తాజాగా నెలకు ఇరవై బిలియన్ డాలర్లకు అటూ ఇటూగా ఉంది, అంటే 240బిలియన్ డాలర్లు. పెరుగుదల దాదాపు రెట్టింపుకు దగ్గరగా ఉంది. వాణిజ్య, పరిశ్రమల శాఖ సమాచారం మేరకు 2023-24లో మన వాణిజ్యలోటు 238 బిలియన్ డాలర్లు. దీనిలో మూడోవంతుకు పైగా 85.09బిలియన్ డాలర్లు చైనాకే సమర్పించుకున్నాం, కొన్ని వస్తువులను హాంకాంగ్ ద్వారా చైనా ఎగుమతులు చేస్తున్నది కనుక దానితో ఉన్న 12.21 బిలియన్ డాలర్లను కూడా కలుపుకుంటే ఇంకా పెరుగుతుంది. మన విదేశీ మారక నిల్వలు అప్పులకు సరిపడా ఉన్నాయి. ఎగుమతులతో వచ్చే రాబడి దిగుమతులకు చాలటం లేదు, దేశం ముందుకుపోతున్నట్లా వెనక్కు నడుస్తున్నట్లా ? చివరకు లాటిన్ అమెరికా దేశాల మాదిరి అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుందా ? విదేశాల్లో ప్రతిష్ట, పలుకుబడి, మార్కెట్లను పెంచానంటారు తప్ప అది దేవతా లేదా మాయావస్త్రంలా మామూలోళ్లకు కనిపించటం లేదు. మాక్రోట్రెండ్స్ నెట్ సమాచారం ప్రకారం 1970లో ఎనిమిది బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ అప్పు నూతన ఆర్థిక విధానాలను అమల్లోకి తెచ్చిన 1990నాటికి 83బి.డాలర్లకు చేరింది. తరువాత పదేళ్లకు 101, 2010 నాటికి 290, మోదీ అధికారానికి వచ్చేనాటికి 457 బిలియన్ డాలర్లకు చేరింది. అప్పటి నుంచి ఐఎంఎఫ్ తాజా విశ్లేషణ ప్రకారం 2024 మార్చి నాటికి 681, మరుసటి ఏడాది మార్చికి 748 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ సంవత్సరాలలో వార్షిక అప్పు పెరుగుదల శాతాల్లో ఎగుడుదిగుళ్లు ఉండవచ్చు తప్ప మొత్తంగా చూసినప్పుడు పెరుగుదల ధోరణే ఉంది. ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వ దేశీయ రుణ భారం 58.6లక్షల కోట్ల నుంచి 156.6లక్షల కోట్లకు 174శాతం పెరిగింది. కరోనా కారణంగా ఇంత అప్పు చేశాము, ఉచితంగా వాక్సిన్లు వేశాము అని బీజేపీ పెద్దలు చెప్పవచ్చు. ఇన్ని లక్షల కోట్లు దానికే తెచ్చారా ? బడ్జెట్ పత్రాల్లో పేర్కొన్న దాని ప్రకారం 2024 మార్చి నాటికి దేశీయ అప్పు రు.164లక్షల కోట్లు, విదేశీ అప్పు 5లక్షల కోట్లు మొత్తం కలిపితే రు.169లక్షల కోట్లకు, 2025 మార్చి ఆఖరుకు 184లక్షల కోట్లకు చేరనుంది. కరోనా సమయంలో పెద్దగా చర్చ లేకుండా ఎవరూ వ్యతిరేకించరనే ఎత్తుగడతో మూడు సాగు చట్టాలను తీసుకువచ్చినప్పుడు రైతులకు చెప్పిందేమిటి ? మన వ్యవసాయ ఉత్పత్తులకు పెద్దగా మార్కెట్‌ను పెంచాం, నేరుగా ఎక్కడికైనా ఎగుమతులు చేసుకునేందుకు వీలుగా ఈ చట్టాలను తీసుకువచ్చామని చెప్పారు. కానీ మన ఉత్పత్తులకు మోదీ చెప్పినంత మార్కెట్, ఎగుమతి అవకాశాలు లేని కారణంగానే ఎదుగూబొదుగూ లేకపోవటం లేదా గిడసబారిన తీరు కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతులను పెంచామని తమ జబ్బలను తామే చరుచుకుంటారు. మొత్తం ఎగుమతుల్లో అవి 4.1 నుంచి ఐదేళ్లలో 7.1శాతానికి పెరిగాయి. ఇదే



సమయంలో మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా, ఎగుమతుల ప్రోత్సాహక పథకం వంటి కబుర్లు ఎన్ని చెప్పినా మొత్తం పారిశ్రామిక వస్తువుల ఎగుమతుల వాటా తగ్గుతోంది.మనం ముడి చమురును దిగుమతి చేసుకొని దాన్నుంచి ఉత్పత్తులను తయారు చేసి ఎగుమతి చేయటం ఒక్కటే పెరుగుతోంది.అది కూడా రష్యా నుంచి చౌకగా దిగుమతులు చేసుకొని ఎగుమతులు పెరిగినందున ఆ మేరకు ఉంది. చమురుకు విదేశాల మీద ఆధారపడటం తగ్గించాలని గద్దెనెక్కగానే చెప్పారు. స్వదేశీ ఉత్పత్తి పెంచుతా మన్నారు.2014-15లో మొత్తం దేశీయ ముడిచమురు ఉత్పత్తి 37.46మిలియన్ టన్నులు కాగా అదేమి దరిద్రమో పదేళ్లలో 30మిలియన్ టన్నులకు పడిపోయింది. దీనిలో 22.6 మిలియన్ టన్నులు పనికిరాని వంటూ నిత్యం ఆడిపోసుకునే ప్రభుత్వ రంగ సంస్థలే చేస్తున్నాయి. రిలయెన్స్ వంటి ప్రైవేటు కార్పొరేట్లకు అప్పగించేందుకు వాటిని కూడా సరిగా పని చేయనివ్వకుండా చేస్తున్నందున వాటి ఉత్పత్తి కూడా తగ్గిపోయింది. వ్రతం చెడ్డా ఫలం దక్కిందా అంటే ప్రైవేటు కంపెనీలు పొడిచిందేమీ లేదు.

చైనా వృద్ధి రేటు భారత్ కంటే ఎంతో తక్కువగా ఉందని, రియల్‌ఎస్టేట్ రంగం సంక్షోభంలో పడిందని, మొత్తం ఆర్థిక వ్యవస్థే కుప్పకూలిపోనుందన్నట్లుగా రోజూ ఏదో ఒక వార్త వస్తూనే ఉంది. జూన్ మాసంలో మన ఎగుమతులు 2.5శాతం పెరగ్గా, దిగుమతుల వృద్ధి రేటు ఐదు శాతం ఉన్నట్లు వెల్లడించిన తరుణంలోనే చైనా గురించి కూడా వార్తలు వచ్చాయి. రాయిటర్స్ విశ్లేషణ ప్రకారం జూన్‌లో చైనా ఎగుమతులు అంచనాలకు మించి జరగ్గా దిగుమతులు తగ్గాయి. ఇలా జరగటం అంటే స్థానిక డిమాండ్ తగ్గటం ఆందోళన కలిగించే పరిణామం, గిరాకీని పెంచాలంటే ఉద్దీపన పథకాలను అమలు జరపాలని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రపంచంలో డిమాండ్ పెరిగిన కారణంగా చైనా ఎగుమతులు 8.6శాతం పెరిగినట్లు జపాన్ ఆసియా నికీ డాట్‌కామ్ పేర్కొన్నది. చైనా వస్తువుల దిగుమతులను అడ్డుకొనేందుకు అనేక దేశాలు భారీ మొత్తాలలో దిగుమతి పన్నులను విధించినప్పటికీ ఈ పెరుగుదల ఉంది. ఇదే సమయంలో మన వస్తువుల మీద అలాంటి పన్నులు లేకున్నా ఎగుమతులు 2.5శాతానికే ఎందుకు పరిమితం అయినట్లు ? చైనా దిగుమతులు తగ్గినందున గిరాకీ పెంచేందుకు ఉద్దీపన ప్రకటించాలని కోరుతున్నవారు విదేశీ కార్పొరేట్ల ప్రతినిధులు తప్ప వేరు కాదు. స్వదేశీ వస్తు వినియోగం తగ్గితే ఆందోళన చెందాలి లేదా పెంచటానికి ప్రోత్సాహకాలు ఇస్తే ఏ దేశానికైనా లాభం, గిరాకీ పెరిగితే పరిశ్రమలు పని చేస్తాయి, కార్మికులకు ఉపాధి దొరుకుతుంది, జనాలకు రాబడి పెరిగితే గిరాకీ పెరుగుతుంది తప్ప విదేశీ వస్తువులకు రాయితీలు ఇస్తే ఆయా దేశాల పరిశ్రమలకు, కార్మికులకు లబ్ధి ఉంటుంది. ఇప్పుడు మనం చేస్తున్నది అదే. అయితే చైనా దిగుమతుల్లో మూడో వంతు పరికరాలు తిరిగి ఎగుమతి చేసేందుకు ఉద్దేశించిన విడి భాగాలే. ఈ రీత్యా చైనాకు సమస్యలొస్తే వాటిని ఎగుమతి చేసే దేశాలకూ వచ్చినట్లే. కనుక అవి కూడా చైనాతో సంబంధాలను పునరాలోచించుకోవాలి. ఇతర దేశాల ఆంక్షల కారణంగా దిగుమతులకు అవకాశం లేని సెమీ కండక్టర్ల వంటి వాటిని చైనా స్వయంగా తయారు చేసుకోవటం కూడా ప్రారంభించింది. తొలి ఆరు నెలల కాలంలో చైనా ఎగుమతులు 3.6శాతం పెరిగి 1.71లక్షల కోట్ల డాలర్లకు, దిగుమతులు రెండుశాతం పెరిగి 1.27లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. వాణిజ్య మిగులు 435బిలియన్ డాలర్లు. మన అధికారులు చెప్పినట్లు మొత్తం ఎగుమతులు 800బిలియన్ డాలర్లకు పెరిగినప్పటికీ అది చైనా వాణిజ్య మిగులు కంటే తక్కువే. అమెరికా వంటి వ్యతిరేక దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచుకోవటం కంటే అదిరించి బెదిరించి తమ వస్తువులను కొనిపించాలని లేదా చైనాను ఎలా దెబ్బతీయాలా అన్నదాని మీదే ఎక్కువ కేంద్రీకరిస్తున్నట్లు కనిపిస్తోంది. అనేక దేశాలు రక్షణాత్మక చర్యలకు పూనుకున్నాయి. చైనా వస్తువుల మీద అవి కేంద్రీకరిస్తున్నప్పటికీ అంతిమంగా ఇతర దేశాల మీద కూడా ఆంక్షలకు పూనుకుంటాయి. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్లీనం తీసుకున్న నిర్ణయాల గురించి అనేక దేశాలు ఎదురు చూస్తున్నాయి.

షిండేది ట్రబుల్ ఇంజిన్ సర్కార్

ఎన్‌సీపీ(ఎస్‌పీ) నాయకులు పాటిల్, కోల్హే
మహాయుతి ప్రభుత్వ అక్రమాలపై పుస్తకం విడుదల

ముంబై : శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ) శుక్రవారం మహారాష్ట్రలో పాలక మహాయుతి ప్రభుత్వానికి చెందిన 'కాలే కర్ణమే' (నల్ల పనులు) పుస్తకాన్ని విడుదల చేయడంతో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధం చేసింది. పుస్తకాన్ని విడుదల చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ మాట్లాడుతూ ఇది 'ట్రిపుల్ ఇంజిన్ కాదు... ట్రబుల్ ఇంజిన్ సర్కార్' అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని అధికార కూటమిలో బీజేపీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ ఉన్నాయి. నిరుపేద మహిళలకు నెలకు 1,500 రూపాయల ఆర్థిక సాయం వాగ్దానం చేసే 'లడ్కీ బహిన్' పథకానికి బదులుగా 'సీఎం కావాలనుకునే వారందరి డిమాండ్లను తీర్చడానికి లడ్కీ ఖుర్చీ పథకం' ప్రారంభించాలని పాటిల్ అన్నారు. మహాయుతి ప్రభుత్వ 'నల్ల పనుల'పై తన పుస్తకంలో, ప్రతిపక్ష ఎన్‌సీపీ (ఎస్‌పీ) రాష్ట్రంలో 'దుష్పరిపాలన', 'అవినీతి' పై తీవ్ర దాడిని ప్రారంభించేటప్పుడు పాలక కూటమికి చెందిన 10 'వైఫల్యాలను' ప్రత్యేకంగా ఎత్తి చూపింది. దక్షిణ ముంబైలోని బల్లార్డ్ ఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయంలో శిరూర్ ఎంపీ అమోల్ కోల్హే, పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్‌పర్సన్, రాజ్యసభ మాజీ సభ్యురాలు వందనా చవాన్, వారి విద్యార్థి విభాగం అధ్యక్షుడు సునీల్ గవానేతో కలిసి పాటిల్ పుస్తకాన్ని విడుదల చేశారు. శరద్ పవార్ స్థాపించిన ఎన్‌సీపీ గత ఏడాది అజిత్ పవార్ తనకు విధేయులైన ఎమ్మెల్యేలతో విభేదించి ప్రభుత్వంలో చేరడంతో చీలిపోయింది. అజిత్ తర్వాత పార్టీ పేరు, దాని గడియారం గుర్తును పొందాడు. మహాయుతి ప్రభుత్వ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి జయంత్ పాటిల్ మాట్లాడుతూ 'దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడుల గురించి మాట్లాడుతున్నారు. అయితే ఇవి కేవలం వాదనలు మాత్రమే. ఆ పెట్టుబడిలో మహారాష్ట్రకు ఎంత వచ్చింది? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు?' అని ప్రశ్నించారు. మూడు కాకులు కూర్చున్న నల్లటి బెలూన్‌ను కలిగి ఉన్న ఈ పుస్తకాన్ని అమోల్ కోల్హే మహారాష్ట్రలో 'గాంధీ జీ తీన్ బందర్ (మూడు కోతులు) కు పునర్నిర్మాణం' గా పేర్కొన్నారు. అసలు కోతులు 'చెడు చూడవద్దు, చెడు వినవద్దు, చెడు మాట్లాడవద్దు' చుట్టూ కేంద్రీకృతమై ఉండగా, మహారాష్ట్రలోని కాకులు రాష్ట్రంలో ఏదైనా సానుకూల పని గురించి 'చూడవు, వినలేవు, మాట్లాడవు' అనే కొత్త భావజాలాన్ని సూచిస్తున్నాయన్నారు. పుస్తకావిష్కరణతో పాటు రాబోయే రాష్ట్ర ఎన్నికల కోసం తమ మేనిఫెస్టో కోసం ఎన్‌సీపీ(ఎస్‌పీ) నాయకులు 'క్రౌడ్‌సోర్స్' సూచనల ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. 'మై డ్రీమ్ మహారాష్ట్ర' ప్రచారం జులై 19 నుంచి ఆగస్టు 15 వరకు కొనసాగుతుంది. మహా వికాస్ అఘాడి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్‌సీపీ (ఎస్‌పీ) పరిశీలిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్తంగా సాధారణ పౌరుల నుంచి సలహాలను సేకరిస్తుంది. ఎన్‌సీపీ(ఎస్‌పీ) ప్రతిపక్ష కూటమి ఎంవీఏలో భాగం, ఇందులో కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) కూడా భాగస్వాములుగా ఉన్నాయి. 'మహారాష్ట్ర ప్రజలు ఆత్మగౌరవం కలవారు. వారు ఎప్పుడూ అణచివేతకు వ్యతిరేకంగా నిలిచారు. ఈసారి కూడా వారు 'గులాబీ స్వప్న' (గులాబీ కలలు) చూపేవారిని తిరస్కరిస్తారు. గత రెండేళ్లుగా మహారాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసిన చీకటి మరకను మేము తొలగిస్తాం' అని కోల్హే అన్నారు. మేనిఫెస్టో ప్రచారంలో మూడు పోటీలు ఉంటాయని, రెండు డిజిటల్ పోటీలు రీల్స్, పోస్టర్లతో కూడినవి, అన్ని జిల్లాల్లో పోటీలు ఉంటాయని, రాష్ట్రాన్ని పునర్నిర్మించాలని యువత భావిస్తున్నారని సునీల్ గవానే చెప్పారు. జయంత్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో తన మేనిఫెస్టో ప్రచారాన్ని ప్రారంభించిన మొదటి పార్టీ ఎన్‌సీపీ(ఎస్‌పీ) అని, ఓటర్లను, ముఖ్యంగా యువతను తన రాజకీయ వేదికపైకి ఆకర్షించడానికి వినూత్నమైన క్రౌడ్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకుంటుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 10 సీట్లలో 8 స్థానాల్లో విజయం సాధించి, రాష్ట్రంలో అత్యధిక స్ట్రైక్‌రేట్‌తో ఎన్‌సీపీ (ఎస్పీ) ఆవిర్భవించిందని, ఈ విజయాన్ని అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరావృతం చేసేందుకు సన్నాహాలు ప్రారంభించిందని ఆయన చెప్పారు. పార్టీ ఇప్పటికే 'నిష్ఠవన్ సంవద్ దౌరా' (లాయల్ డైలాగ్ టూర్) పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించిందన్నారు. రాబోయే వారాల్లో శరద్ పవార్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలేతో సహా ఇతర సీనియర్ నాయకులు కూడా ఇలాంటి పర్యటనలను ప్రారంభించాలని భావిస్తున్నట్లు కోల్హే చెప్పారు. రాష్ట్రంలోని 288 అసెంబ్లీ స్థానాల్లో 2019 రాష్ట్ర ఎన్నికలలో అవిభక్త ఎన్‌సీపీ 54 స్థానాలను గెలుచుకుంది.

ఖాలిస్థానీ ఉగ్రవాది బల్జీత్‌సింగ్ అరెస్టు

న్యూఢిల్లీ: మారణాయుధాల సరఫరాకు సంబంధించిన ప్రధాన ఉగ్రవాద నెట్‌వర్క్ కేసులో ఖాలిస్థానీ ఉగ్రవాది లఖ్‌బీర్ సింగ్ అలియాస్ లాండా కీలక సహాయకుడు బల్జీత్‌సింగ్‌ను అరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) శుక్రవారం తెలిపింది. మధ్యప్రదేశ్‌లోని బద్వానీ జిల్లాకు చెందిన బల్జీత్‌సింగ్ అలియాస్ రాణా భాయ్ అలియాస్ బల్లిగా పిలిచే ఇతన్ని పంజాబ్‌లో గురువారం ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. పంజాబ్‌లోని లాండా ఏజెంట్లకు ప్రధాన ఆయుధాల సరఫరాదారుడిగా బల్జీత్‌సింగ్‌ని ఎన్‌ఐఏ అధికారులు గుర్తించారు. ఇతను సరఫరా చేసిన ఆయుధాలు వ్యాపారవేత్తలపై జరిగే దోపిడీలతో సహా పెద్దఎత్తున ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి ఉపయోగించినట్లు ఎన్‌ఐఏ పేర్కొంది. కాగా, ఈ కేసులో లాండా సహచరుడైన గుర్‌ప్రీత్‌సింగ్ గోపి, మరో వ్యక్తి సత్నామ్ సింగ్ సత్తాను ఎన్‌ఐఏ అధికారులు అరెస్టు చేశారు. పంజాబ్ తదితర ప్రాంతాల్లో హింసాత్మక చర్యలకు పాల్పడేందుకు ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థల కుట్రలో భాగంగానే బల్జీత్‌సింగ్ సత్తాకు కూడా ఆయుధాలు అందించినట్లు ఈ కేసు దర్యాప్తులో వెల్లడైందని ఎన్‌ఐఏ తెలిపింది.

కుల, మత విభజనకు మద్దతు ఇవ్వొద్దు

కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ : తినుబండారాల యజమానులు తమ పేర్లను ప్రదర్శించమని ముజఫర్‌నగర్ పోలీసుల సలహాను కేంద్ర మంత్రి, బీజేపీ మిత్రుడు చిరాగ్ పాశ్వాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తాను కులం లేదా మతం పేరుతో విభజనను 'కచ్చితంగా ఎప్పటికీ సమర్థించను లేదా ప్రోత్సహించనని' చెప్పారు. మీరు పోలీసుల సలహాకు మద్దతిస్తారా అని అడిగినప్పుడు లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు పీటీఐ సంపాదకులతో ఒక సంభాషణ కార్యక్రమంలో మాట్లాడుతూ 'లేదు, నేను చేయను' అని అన్నారు. సమాజంలో ధనిక, పేద అనే రెండు తరగతుల ప్రజలు ఉన్నారని, వివిధ కులాలు, మతాలకు చెందిన వ్యక్తులు రెండు వర్గాలలో ఉంటారని తాను నమ్ముతున్నానని ఆయన తెలిపారు. 'మనం ఈ రెండు తరగతుల ప్రజల మధ్య అంతరాన్ని తగ్గించాలి. దళితులు, వెనుకబడిన, అగ్రవర్ణాలు, ముస్లింలు వంటి సమాజంలోని అన్ని వర్గాల వారు పేదల కోసం పని చేయడం ప్రతి ప్రభుత్వ బాధ్యత. అందరూ ఉన్నారు. వారి కోసం మనం పనిచేయాలి' అని పాశ్వాన్ అన్నారు. 'కులం లేదా మతం పేరుతో ఇలాంటి విభజన జరిగినప్పుడు నేను దానిని పూర్తిగా సమర్థించను లేదా ప్రోత్సహించను. కులం లేదా మతంతో సంబంధం లేకుండా నా వయస్సులో చదువుకున్న ఏ యువకుడైనా ఇలాంటి వాటి వల్ల ప్రభావితమవుతారని నేను అనుకోను' అని ఆయన స్పష్టం చేశారు. ఈ 41 ఏళ్ల మూడోసారి లోక్‌సభ ఎంపీ తనను తాను కులతత్వం, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న 21వ శతాబ్దపు చదువుకున్న యువకుడిగా అభివర్ణించారు. పాశ్వాన్ తన సొంత రాష్ట్రం బీహార్ వెనుకబాటుకు ఈ కారకాలు ప్రధానంగా కారణమని భావించారు. కులతత్వం, మతతత్వం బీహార్‌కు అత్యంత హాని చేశాయని, ఈ విషయాలపై తనకు నమ్మకం లేదని బహిరంగంగా మాట్లాడే ధైర్యం ఉందని తెలిపారు.

కాంగ్రెస్ 'మహా' ఎన్నికల కసరత్తు

కేసీ వేణుగోపాల్, చెన్నితాల ముంబైలో సమావేశాలు

ముంబై : త్వరలో జరగనున్న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పార్టీ సన్నాహాలను సమీక్షించేందుకు, ఎన్నికల వ్యూహాలను ఖరారు చేసేందుకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ రమేశ్ చెన్నితాల శుక్రవారం నగరానికి వచ్చారు. సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రముఖ నాయకులు, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశమవుతారని పార్టీ నేత ఒకరు తెలిపారు. అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) లో భాగమైన కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ (ఎస్‌పీ) కూడా మహారాష్ట్రలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే విధమైన ఫలితాలు సాధించేందుకు పార్టీ సన్నాహాలు ప్రారంభించిందని ఆయన తెలిపారు. వేణుగోపాల్, చెన్నితాల ముంబైలో రోజంతా సమావేశాలు నిర్వహించి ఎన్నికల సన్నాహాలను సమీక్షిస్తారని, కాంగ్రెస్ నేతలు, ఆఫీస్ బేరర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. దక్షిణ ముంబైలోని గార్వేర్ క్లబ్‌లో పార్టీ రాష్ట్ర నేతలతో సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలను పార్టీ విశ్లేషిస్తుందని, అసెంబ్లీ ఎన్నికల సన్నాహాలను సమీక్షించనున్నట్లు పార్టీ అధినేత తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ, సంస్థాగత వ్యవహారాలపై సమీక్ష జరిపి వ్యూహాలను నిర్ణయిస్తామని ఆయన వివరించారు.

క్రాస్ ఓటింగ్ చేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నాం : కేసీ వేణుగోపాల్

మహారాష్ట్ర శాసన మండలిలోని 11 స్థానాలకు గత వారం జరిగిన ద్వైవార్షిక ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నట్లు కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. 'క్రాస్ ఓటింగ్ వేసిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకున్నాం. భవిష్యత్‌లో ఫలితం చూస్తారు. క్రమశిక్షణ చాలా ముఖ్యం' అని మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు పార్టీ సన్నాహాలను సమీక్షించి ఎన్నికల వ్యూహాలపై నిర్ణయం తీసుకోవడానికి ఇక్కడ జరిగిన సమావేశంలో పాల్గొన్న అనంతరం వేణుగోపాల్ విలేకరులతో అన్నారు. అయితే ఓటు వేసేటప్పుడు పార్టీ ఆదేశాన్ని ధిక్కరించిన ఎమ్మెల్యేల సంఖ్య లేదా పేర్లను ఆయన వెల్లడించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అసమ్మతి శాసనసభ్యులను తిరస్కరిస్తారా అని అడిగినప్పుడు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి 'మీ స్వంత అంచనాలు ఉండవచ్చు' అని అన్నారు. శాసన మండలికి జులై 12న జరిగిన ద్వైవార్షిక ఎన్నికల్లో ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు. 37 మంది ఎమ్మెల్యేలను కలిగి ఉన్న కాంగ్రెస్, దాని అభ్యర్థి ప్రద్యునా సతవ్‌కు 30 మొదటి ప్రాధాన్యత ఓట్ల కోటాను నిర్ణయించింది. మిగిలిన ఏడు ఓట్లు మిత్రపక్షమైన శివసేన (యూబీటీ) అభ్యర్థి మిలింద్ నార్వేకర్‌కు పడాల్సి ఉంది. చివరికి, సతవ్‌కు 25, నర్వేకర్‌కు 22 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. అంటే కనీసం ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేశారు.

నేటి నుంచి హర్యానాలో సునీతా కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ/చండీగఢ్ : హర్యానాలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని శనివారం ప్రారంభించనుంది. ఢిల్లీ సీఎం సతీమణి సునీతా కేజ్రీవాల్ శనివారం హర్యానాలోని పంచకులలో జరిగే టౌన్‌హాల్ సమావేశంలో 'కేజ్రీవాల్‌కి గ్యారంటీ' ని ప్రకటిస్తారని ఆప్ ప్రకటన తెలిపింది. ఆమె వెంట పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) సందీప్ పాఠక్, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ కూడా ఉంటారు. ఆప్ జాతీయ కన్వీనర్‌గా ఉన్న ఢిల్లీ సీఎం ప్రస్తుతం మద్యం పాలసీకి సంబంధించిన కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. సునీతా కేజ్రీవాల్ తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, హర్యానా, గుజరాత్‌లో పార్టీ అభ్యర్థుల కోసం చురుగ్గా ప్రచారం చేశారు. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న హర్యానాలోని మొత్తం 90 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ఆప్ గత మంగళవారం ప్రకటించింది. హర్యానాలో ఆప్ అనేక ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, ఎన్నికల విజయాన్ని అందుకోలేదు. మే నెలలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి ఆ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ గుప్తా బీజేపీ అభ్యర్థి నవీన్ జిందాల్ చేతిలో ఓడిపోయారు. ఈ మేరకు ఆప్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుశీల్ గుప్తా శుక్రవారం చండీగఢ్‌లో విలేకరులతో మాట్లాడుతూ శనివారం పంచకులలోని టౌన్ హాలులో సునీతా కేజ్రీవాల్ 'కేజ్రీవాల్ హామీలను' ప్రారంభిస్తారని తెలిపారు. 'మేము బీజేపీ, కాంగ్రెస్ వంటి వాగ్దానాలు చేయం. మేము హామీలు ఇస్తాం. ఇవి అరవింద్ కేజ్రీవాల్ హామీలు, (నరేంద్ర) మోదీకి చెందిన పొత్తు హామీలు కాదు' అని అన్నారు. ఈ హామీల్లో హర్యానాకు ఎస్‌వైఎల్ జలాలు అందిస్తాయా అని అడిగినప్పుడు గుప్తా, 'హర్యానాకు నీరు రావాలి. ప్రతి రాష్ట్రానికి నీరు రావాలి. నీటి పంపిణీ కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి పని' అని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం విధానసభ సెగ్మెంట్ల వారీగా 45 సమావేశాలు నిర్వహిస్తామని గుప్తా తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ఇదిలా ఉండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ సోదరుడు, దివంగత సునీల్ దత్ మేనల్లుడు యువరాజ్ దత్ శుక్రవారం ఇక్కడ ఆప్‌లో చేరినట్లు తెలిపారు. అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు వంటి సుపరిపాలన అందిస్తున్న ఆప్ నమూనా యువరాజ్‌ని ఎంతగానో ఆకట్టుకుందని ఆయన అన్నారు. 'ఆయన ఇంతకుముందు ముంబైలో నివసించాడు.

అనేక బహుళజాతి కంపెనీలలో కూడా పనిచేశాడు. కానీ ఇప్పుడు హర్యానాలోని యమునానగర్ జిల్లాలోని తన పూర్వీకుల గ్రామమైన మండోలికి మారాడు. ఆయన తన ప్రజలకు సేవ చేయాలనుకుంటున్నాడు. అతను సేంద్రీయ చేపల పెంపకాన్ని కూడా ప్రారంభించాడు' అని గుప్తా చెప్పారు. అవినీతికి వ్యతిరేకంగా ఆప్ చేస్తున్న ఉద్యమం తనను ఎంతగానో ఆకట్టుకుందని యువరాజ్ విలేకరులతో అన్నారు. త్వరలో జరగనున్న హర్యానా ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు విముఖత లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఇలాగైతే ముస్లిం రాష్ట్రంగా అసోం: సీఎం

గువహతి: అసోం జనాభాలో 40 శాతం మంది ముస్లింలు ఉన్నారని, 2041 నాటికి మెజారిటీ జనాభా ముస్లింలే కానున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత విశ్వశర్మ చెప్పుకొచ్చారు. ప్రతి పదేళ్లకు ముస్లిం జనాభా 30 శాతం చొప్పున పెరుగుతోందని మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ముస్లింల జనాభా పెరుగుదలలో కాంగ్రెస్ పాత్ర కీలకమని అన్నారు. జనాభా నియంత్రణకు రాహుల్ బ్రాండ్ అంబాసిడర్ అయితే...ముస్లిం జనాభాను నియంత్రించవచ్చని అన్నారు. ముస్లిం కమ్యూనిటీ రాహుల్ మాటలు వింటుందని చెప్పారు.

1935 చట్టం రద్దు చేస్తాం

బాల్య వివాహాలు నిరోధించడం, వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ల విషయంలో సమానత్వం తీసుకువచ్చేందుకు పాతబడిన అసోం ముస్లిం మ్యారేజెస్ అండ్ డైవోర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్-1935ను రద్దు చేయాలని అసోం ప్రభుత్వం శుక్రవారం నిర్ణయించింది. దీనిపై సీఎంఓ ట్వీట్ చేస్తూ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అదనపు భద్రత కల్పించం ద్వారా మహిళలకు న్యాయం చేసేందుకు కీలకమైన నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అసోం మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు అసోం ముస్లిం మ్యారేజెస్ అండ్ డైవోర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్-1935ను రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందుకోసం అసోం రిపీలింగ్ బిల్-2024ను వచ్చే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో తెస్తామని చెప్పారు. అసోంలో ముస్లిం వివాహాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన శాసనం చేసేందుకు కూడా క్యాబినెట్ నిర్ణయించినట్టు తెలిపారు.

లోక్‌సభకు ఆరు కొత్త బిల్లులు

లోక్‌సభ సెక్రటేరియేట్ ప్రకటన

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 22న ప్రారంభం కానున్నాయి. సభలో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులు ప్రవేశపెట్టనుంది. లోక్‌సభ సెక్రటేరియట్ విడుదల చేసిన బులెటిన్‌లో బిల్లుల జాబితాను ప్రకటించారు. విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లు, ఆర్థిక బిల్లు, 1934 ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయన్ విధేయక్ - 2024 బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ (ప్రమోషన్, అభివృద్ధి)బిల్లు, రబ్బరు (ప్రమోషన్, అభివృద్ధి) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. కాగా, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పార్లమెంటరీ అజెండాను నిర్ణయించే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)ని ఏర్పాటు చేశారు. లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీలో స్పీకర్ సహా 15 మంది సభ్యులు, ఎక్స్‌అఫీషియో చైర్‌పర్సన్‌గా ఉంటారు. సభ్యులను స్పీకర్ నామినేట్ చేస్తారు. కమిటీ సాధారణంగా ప్రతి పార్లమెంటు సెషన్ ప్రారంభంలో, ఆ తర్వాత అవసరమైనప్పుడు సమావేశమవుతుంది. బిజినెస్ అడ్వైజరీ కమిటీని మొదటిసారిగా జులై 14, 1952న ఏర్పాటు చేశారు. బీఏసీ చైర్మన్‌గా ఓం బిర్లా, సభ్యులుగా పీపీ చౌదరి (బీజేపీ, నిషికాంత్ దూబే (బీజేపీ), అనురాగ్ ఠాకూర్ (బీజేపీ), సంజయ్ జైస్వాల్ (బీజేపీ), భర్తృహరి మహతాబ్ (బీజేపీ), బైజయంత్ పాండా (బీజేపీ), గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్), కొడికున్నిల్ సురేశ్ (కాంగ్రెస్), దిలేశ్వర్ కమైత్ (జేడీయూ), లావు శ్రీకృష్ణ దేవరాయలు (టీడీపీ), సుదీప్ బంద్యోపాధ్యాయ (టీఎంసీ), దయానిధి మారన్ (డీఎంకే), అరవింద్ సావంత్ (శివసేన-యూబీటీ), లాల్జీ వర్మ (ఎస్‌పీ) ఉన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి.

బెంగాల్ బీజేపీలో చీలిక?

సువేందు వ్యాఖ్యలపై దుమారం



కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన స్థాయిలో సీట్లు సాధించకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లో ప్రముఖ నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఏకంగా సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. యూపీలో వివాదం నడుస్తుండగానే... పశ్చిమ బెంగాల్ బీజేపీలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే సువేందు అధికారి వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ నినాదాన్ని వదిలిపెట్టి మాతో ఉన్నవారితో మేం అనే కొత్త నినాదాన్ని తీసుకోవాలని సువేందు సూచించారు. సువేందు అధికారి వ్యాఖ్యలు బెంగాల్ బీజేపీలో కలకలం సృష్టిస్తున్నాయి. కొందరు నేతలు సువేందు వ్యాఖ్యలకు మద్దతుగా నిలవగా... మరికొందరు ఆ వ్యాఖ్యలు పార్టీ వైఖరికి విరుద్ధమంటున్నారు. ఇటీవల జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమాశాల్లో సువేందు అధికారి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో సీట్లు గెలవకపోవడానికి ప్రధాన కారణం మైనార్టీ వర్గాల నుంచి మద్దతు లేకపోవడమేనని చెప్పారు. అందువల్ల సబ్ కా సాత్.. సబ్‌వికాస్ నినాదం అవసరం లేదని, దానికి బదులు మనతో ఉన్నవారితో మేము అంటూ కొత్త నినాదాన్ని ప్రతిపాదించారు. సువేందు వ్యాఖ్యలపై బీజేపీ పశ్చిమ బెంగాల్ శాఖ అధికారికంగా స్పందిస్తూ ఆ వ్యాఖ్యలు కేవలం సువేందు వ్యక్తిగతమని తెలిపింది. సువేందు అధికారి వ్యాఖ్యలకు కొందరు బీజేపీ నేతలు మద్దతుగా నిలిచారు. బీజేపీ బెంగాల్ మాజీ అధ్యక్షుడు తథాగత రాయ్ స్పందిస్తూ సువేందు అధికారి చెప్పింది నిజమేనన్నారు. సువేందు అధికారి పరిపాలనకు సంబంధించిన అంశంలో ఆ నినాదాన్ని వ్యతిరేకించడం లేదని, బెంగాల్‌లో రాజకీయ పరిస్థితుల దృష్ట్యా మాత్రమే ఆ నినాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాయ్‌తో పాటు మాజీ ఎంపీ అర్జున్ సింగ్ కూడా సువేందుకు మద్దతుగా నిలిచారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా అన్ని వర్గాలను ఎలా కలుపుకుపోవాలనే విషయంపై సువేందు తన అభిప్రాయాన్ని చెప్పారన్నారు. కొందరు నేతలు సువేందు అధికారికి మద్దతు ఇవ్వడంపై బీజేపీ పశ్చిమబెంగాల్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ స్పందిస్తూ పార్టీ అధికారిక వైఖరిలో ఎటువంటి రాజీ ఉండబోదన్నారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ తమ విధానమని, ఇందులో రాజీ లేదన్నారు. మరోవైపు మంజుదార్ వ్యాఖ్యలపై సువేందు అధికారి స్పందిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కూడా వ్యక్తిగతంగా తన అభిప్రాయాలకు మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు.

విచక్షణ మరిచిన పోలీసులు

బెంగళూరు: ఓ వ్యక్తి ప్రమాదానికి గురై రక్తపుమడుగులో ఉన్న సమయంలో పోలీసులు అలసత్వం ప్రదర్శించారు. అతడికి సహాయం చేసే విషయంలో ఒకరితో ఒకరు వాదించుకున్న వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ వీడియో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వివరాల ప్రకారం... ఇటీవల బెంగళూరులోని త్రివేణి రోడ్‌లో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే క్షతగాత్రుడిని ఎవరు, ఎవరి వాహనంలో ఆస్పత్రికి తరలించాలనే విషయంలో ట్రాఫిక్ పోలీసులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం నెలకొంది. అనంతరం క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తూ పోలీసుల తీరుపై మండిపడుతున్నారు. ఇటువంటి వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వీడియోపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ ... ఘటనపై విచారణ చేసి, పోలీసులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మరిన్ని చిక్కుల్లో పూజా ఖేద్కర్

యూపీఎస్‌సీ కేసు నమోదు

న్యూఢిల్లీ: వివాదాస్పద ఐఏఎస్ ట్రైనీ అధికారి పూజా ఖేద్కర్‌పై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) చర్యలకు దిగింది. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత కోసం మోసపూరితంగా సర్టిఫికెట్లు పొందిన అభియోగాలపై ఆమెపై శుక్రవారం కేసు నమోదు చేసింది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2022కు సంబంధించి ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేసేందుకు, భవిష్యత్ పరీక్షల నుంచి డిబార్ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు పూజా ఖేద్కర్‌కు షోకాజ్ నోటీసు జారీచేసింది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2022లో ఉత్తీర్ణత కోసం పూజా మనోరమ దిలీప్ ఖేద్కర్ అనేక అవకతవకలకు పాల్పడినట్టు తమ విచారణలో తేలిందని ఒక ప్రకటనలో యూపీఎస్‌సీ తెలిపింది. తన పేరు, తల్లి, తండ్రి పేరు, ఫొటో, సంతకం, ఈమెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్, చిరునామా మార్చడం, నకిలీ గుర్తింపు వంటివి మోసపూరితంగా పొందినట్టు తమ విచారణలో వెల్లడైందని పేర్కొంది. దీంతో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం ద్వారా ఆమెపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు దిగడం, 2022 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఆమె అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం, భవిష్యత్ పరీక్షల నుంచి డిబార్ చేయడం వంటి చర్యలతో పాటు పూజా ఖేద్కర్‌కు నోటీసులు వంటి చర్యలను ప్రారంభించినట్టు ఆ ప్రకటనలో తెలిపింది. రాజ్యాంగ నిబద్ధత, యూపీఎస్‌సీ పరీక్షల నిర్వహణలో విశ్వసనీయతకు తాము కట్టుబడి ఉన్నట్టు వివరించింది.

పీఎం కిసాన్ రూ.8 వేలకు పెంపు?

న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 23వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర బడ్జెట్‌కు మరికొద్ది రోజులే సమయం ఉండటంతో దేశవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి ఎన్నో ఆశలు, అంచనాలు వ్యక్తమవుతున్నాయి. యువత, మహిళలు, రైతులు, శ్రమ జీవులు, పారిశ్రామిక వేత్తలు సహా అనేక వర్గాల ప్రజలు కేంద్ర బడ్జెట్ గురించి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ముఖ్యంగా యువత, మహిళలు, రైతులు, కూలీలకు సంబంధించి కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రధానంగా అన్నదాతలకు సంబంధించి ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు మరికొన్ని కొత్త పథకాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రైతులకు సంబంధించి ఉన్న కేంద్ర పథకాలలో పీఎం కిసాన్ కీలకమైంది. 2019లో ప్రారంభించిన ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఈ పథకం కింద రైతులకు ఏడాదికి రూ.6 వేలు పెట్టుబడి సాయంగా కేంద్రం అందిస్తోంది. అయితే, రూ.6 వేలు సరిపోదని, ఈ మొత్తాన్ని పెంచాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కేంద్రం నుంచి కూడా రూ.6 వేలు మొత్తాన్ని పెంచే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. పీఎం కిసాన్ నిధిని రూ. 6 వేల నుంచి రూ. 8 వేలకు పెంచాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే దీనిపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఢిల్లీకి రూ.10 వేల కోట్లు కేటాయించాలి: అతిశీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఆప్ మంత్రి అతిశీ డిమాండ్ చేశారు. సెంట్రల్ జీఎస్టీ కింద ఢిల్లీ నుంచి కేంద్రానికి రూ.25,000 కోట్లు అందుతోందని ఆమె తెలిపారు. ఢిల్లీ ప్రజలు రెండున్నర లక్షల కోట్లకుపైగా ఆదాయపు పన్నుల రూపంలో చెల్లిస్తున్నారని, ఇందులో కొంతభాగం తిరిగి దేశ రాజధానికి దక్కడం తమ హక్కని ఆమె పేర్కొన్నారు. ఈ రెండున్నర లక్షల కోట్లలో ఐదు శాతం రాజధానికి కేటాయించాలని ఆమె కోరారు. ఈనెల 23న కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న క్రమంలో రాజధానిలో రోడ్డు, రవాణా, విద్యుత్ రంగాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు నగరాన్ని సుందరీకరించడానికి ఢిల్లీకి మరింత డబ్బు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2001 నుంచి ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్రం పన్నుల కింద కేవలం రూ.325 కోట్లు మాత్రమే చెల్లిస్తోందని ఆమె అన్నారు. అయితే, ఈ చెల్లింపు కూడా గత ఏడాది ఆగిపోయిందని... ఏడాది కాలంలో నగరానికి ఒక్క రూపాయి కూడా రాలేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల ప్రజలు చెల్లించిన పన్నుల సమాహారమే కేంద్ర బడ్జెట్ అని, ఈ పన్నుల్లో ఢిల్లీ వాటా అత్యధికమని ఆమె స్పష్టం చేశారు.

15 శాతం వృద్ధి లక్ష్యం

- అప్పుడే ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు
- ఏఐ హబ్స్‌గా విశాఖ, అమరావతి అభివృద్ధి
- వికసిత్ ఏపీ-2047పై నీతి ఆయోగ్‌తో చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వృద్ధి రేటు 15 శాతం లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాలని, అప్పుడే ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా ప్రభుత్వ విజన్ ఉండాలని స్పష్టం చేశారు. వికసిత్ ఆంధ్ర ప్రదేశ్-2047 కోసం విజన్ డాక్యుమెంట్‌పై శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. వికసిత్ భారత్-2047కు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లుగానే వికసిత్ ఆంధ్ర ప్రదేశ్-2047కు విజన్ డాక్యుమెంట్ తయారు చేయడంపై, రానున్న రోజుల్లో ఏపీ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై నీతి ఆయోగ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ప్రభుత్వాలు విజన్‌తో పనిచేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో సంస్కరణలు, విజన్‌తో వచ్చిన ఫలితాలు మనం చూశాం. నేడు వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ కోసం విజన్-2047 సిద్ధం చేసుకుని ప్రయాణం సాగించాలి. వినూత్న ఆలోచనతో, సాంకేతికతను ఉపయోగించుకుని పేదరికం లేని సమాజం సాధించాలి. అందుకు అనుగుణంగా వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ విజన్ 2047 సిద్ధం చేయాలి. జనాభా సమతుల్యతపై లోతైన కసరత్తు చేసి ప్రణాళిక సిద్ధం చేయాలి. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయి. అమరావతి, విశాఖపట్టణం ఏఐ హబ్స్‌గా రూపొందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రంలో ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్నాం. ప్రతి సామాన్యుడికీ ఫలాలు అందాలి. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి మండల, కుటుంబ స్థాయి వరకు ఒక యునిట్‌గా ప్రణాళికలు రచించాలి. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందని సీఎం అన్నారు. వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలను తీసుకురావడంతో పాటు ప్రకృతికి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా విధానాలు ఉండాలి. సీమలో హార్టికల్చర్ ఆధారిత ఆహార శుద్ధి పరిశ్రమలు వస్తే రైతులు లబ్ధి పొందుతారు. రాష్ట్ర ప్రగతిలో కీలకమైన విద్యుత్ రంగంలో రానున్న రోజుల్లో అనూహ్య మార్పులు వస్తాయి. వాటికి అనుగుణంగా వ్యవస్థలను, ప్రజలను సిద్ధం చేయాలి. మానవ వనరుల విషయంలో నైపుణ్యం పెంచేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం వరకు సిలబస్ రూపొందించాలని సూచించారు. కొత్త టెక్నాలజీని, అవకాశాలను అందిపుచ్చుకునే విధానాలు విజన్ డాక్యుమెంట్‌లో ఉండాలన్నారు. సంపద సృష్టికి దోహదపడే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఐఐటి, ఐఐఎం, ఐఎస్‌బి వంటి సంస్థలు, మేధావులు, నిపుణులతో చర్చించి డాక్యుమెంట్ సిద్ధం చేయాలని చంద్రబాబు కోరారు. మారుమూల గ్రామంలో ఉన్న సామాన్య వ్యక్తికి కూడా ఫలితాలు అందేలా విజన్ ఉండాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ విజన్ డాక్యుమెంట్‌పై మరిన్ని సమావేశాలు, సమాలోచనలు జరిపి, దాన్ని విడుదల చేయాలని ముఖ్యమంత్రి భావించారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బారా షహీద్ దర్గా అభివృద్ధికి రూ.5 కోట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అత్యంత భక్తిశ్రద్ధలతో నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగను భవిష్యత్తులో అంతర్జాతీయ పండుగగా నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పండుగ నిర్వహించే బారా షహీద్ దర్గా అభివృద్ధికి రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వర్చువల్ విధానంలో శుక్రవారం భక్తులు, ప్రజా ప్రతినిధులతో సీఎం మాట్లాడారు. వందల ఏళ్లుగా ఒక పవిత్రమైన దర్గాగా బారా షహీద్ దర్గాకు పేరు ఉందని, ఇక్కడ రొట్టెలు మార్చుకోవడం ద్వారా తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారని చెప్పారు. ఈ క్షేత్రానికి ఉన్న పవిత్రత, శక్తి కారణంగా ఏడాదికి 10 నుంచి 15 లక్షల మంది రొట్టెల పండుగకు వస్తారని వివరించారు. కేవలం ముస్లిం సోదరులే కాకుండా, హిందువులు కూడా రొట్టెలు మార్చుకుని తమ కోరికలు నెరవేర్చుకుంటారని చెప్పారు. లక్షలాది మంది దేవుడిపై నమ్మకంతో జరుపుకునే రొట్టెల పండుగను 2014లో రాష్ట్ర పండుగగా ప్రకటించామని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దర్గాను, స్వర్ణాల చెరువును అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రస్తుతం ప్రార్థనా మందిరం నిర్మాణం నిలిచిపోయిందని మంత్రి నారాయణ సీఎం దృష్టికి తీసుకురాగా... రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని... దీని నుంచి బయట పడి సంపద సృష్టి జరగాలని, అది జరిగితే...మళ్లీ ఆ ఫలాలు పేదలకు సంక్షేమం ద్వారా పంచవచ్చని అభిప్రాయపడ్డారు. ఖజానా నిండేలా దేవుడిని ప్రార్థిస్తూ రొట్టెలు మార్చుకోవాలని నేతలను కోరారు. విజయవాడ నుంచి వచ్చిన ఇద్దరు మహిళలతో మాట్లాడి వారి అనుభవాలు తెలుసుకున్నారు. తమ కోరికలు తీరడంతో తాము రొట్టెలు మార్చుకోవడానికి వచ్చామని ఆ మహిళలు చెప్పారు. భక్తుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులు, మంత్రులకు చంద్రబాబు సూచించారు.

నాల్గవ తరగతి ఉద్యోగులుగా వీఆర్ఏలు: పల్లా

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వ రెవెన్యూ శాఖలో చిరుఉద్యోగులుగా పనిచేస్తున్న వీఆర్ఏలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం అధ్వర్యంలో వీఆర్ఏల బృందం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పల్లా శ్రీనివాసరావును కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ కేవలం రూ.10,500 వేతనంతో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీఆర్ఏలుగా పనిచేసే వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన పేదలే అధికంగా ఉన్నారని చెప్పారు. అత్యంత ప్రాధాన్యత క్రమంలో తమ సమస్యలు పరిష్కరించి తక్షణం వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేసి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పల్లా శ్రీనివాసరావు వీఆర్ఏల సమస్య న్యాయమైనదని, అందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపాయింట్‌మెంట్ తీసుకొని వీఆర్ఏలతో మాట్లాడిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధ్యక్షుడిని కలిసిన వారిలో ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెల్లూరు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల నాగసుబ్బయ్య, పోతిరెడ్డి లోకేశ్‌రెడ్డి, లోవరాజు, నారాయణ, కర్నూలు సురేశ్ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ బియ్యం, కందిపప్పుకు నాణ్యత అవసరం

చదలవాడ హరిబాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సబ్సిడీ ధరలపై రైతు బజార్లు, మాల్స్‌లో విక్రయిస్తున్న ఉప్పుడు బియ్యం, సోనా మసూరి, కందిపప్పు నాణ్యత తప్పనిసరని సీసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు సూచించారు. గుంటూరు నగరంలోని షాపింగ్ మాల్స్‌లో సంబంధిత అధికారులతో కలిసి ఆయన శుక్రవారం తనిఖీలు చేపట్టారు. డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ గుంటూరులోని కొన్ని షాపింగ్ మాల్స్‌లో సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్న సోనా మసూరి బియ్యం, కంది పప్పు నమూనాలు సేకరించి... తనిఖీ నివేదికలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్లు సునీల్, సాయి, గుంటూరు జిల్లా క్వాలిటీ టెస్టింగ్ ఇన్‌స్పెక్టర్లు అనుపమ, వినియోగదారుల సంఘం నాయకులు ఉన్నారు.

సీఎం చంద్రబాబు కార్యదర్శిగా రాజమౌళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం చంద్రబాబు కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ రాజమౌళి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీజేశారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన ఈయన 2003 బ్యాచ్ ఉత్తర ప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015-19 మధ్య సీఎం కార్యదర్శిగా సీఎంవోలో పని చేశారు. ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్ హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ అయిన రాజమౌళి రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్ట్ చేశారు. రిపోర్ట్ చేసిన వెంటనే ఆయనకు పోస్టింగ్ లభించింది.

బిల్కిస్ బానో దోషుల బెయిల్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని గోద్రాలో 2002లో జరిగిన అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై అత్యాచారం చేసి... ఆమె కుటుంబాన్ని హతమార్చిన కేసులో దోషులకు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. దోషులు రాధేశ్యామ్ భగవాన్‌దాస్, రాజుభాయ్ బాబులాల్ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2022లో గుజరాత్ ప్రభుత్వం దోషుల బెయిల్ పిటిషన్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఈ ఇద్దరూ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ కేసు విచారించడానికి నిరాకరించిన ధర్మాసనం వారి పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. బిల్కిస్ బానోపై 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో సామూహిక అత్యాచారం చేసిన ఘటనలో జీవిత ఖైదు అనుభవిస్తున్న 11 మంది దోషులను గతేడాది గుజరాత్ ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేసింది. వారికి రెమిషన్ మంజూరు చేసిన గుజరాత్ సర్కార్... జైలు నుంచి విడుదల చేసింది. అయితే ఈ నిర్ణయంపై తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు బిల్కిస్ బానో... గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పూర్వాపరాలు పరిశీలించిన సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బిల్కిస్ బానో సవాల్ చేయడం సరైనదేనని స్పష్టం చేసింది. 11 మంది దోషులను విడుదల చేయాలనే నిర్ణయాన్ని, ఖైదీలకు రెమిషన్ మంజూరు చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

బీజేపీని ఆడుకుంటున్న మహువా మొయిత్రా

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా మరోసారి బీజేపీ లక్ష్యంగా విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్యలో బీజేపీ ఓటమిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. ప్రముఖ రచయిత, కమెడియన్ వరుణ్ గ్రోవర్... తన కామెడీ షోలో చేసిన వ్యాఖ్యల వీడియోను తన ఎక్స్ ఖాతాలో ఆమె పోస్ట్ చేశారు. మా అందరినీ చివరిగా నవ్వించినందుకు ఉత్తరప్రదేశ్ ప్రజలకు ధన్యవాదాలంటూ ఆమె తన పోస్ట్‌లో కామెంట్‌ను జత చేశారు. వరుణ్ గ్రోవర్ వీడియో అయోధ్యలో బీజేపీ ఓటమిని ఎగతాళి చేసినట్లుగా వినిపిస్తోందని ఎంపీ మహువా మొయిత్రా వ్యాఖ్యానించారు. 'నేను ఇప్పుడు కామెడీ చేయాల్సిన అవసరం లేదు. రానున్న ఐదేళ్లలో అయోధ్యలో ఓడిపోవడం చూసి నవ్వుకోగలను. తెల్లవారుజామున 2 గంటలకు నిద్ర లేవగానే అయోధ్య గురించి తలచుకుని కనీసం అరగంట అయినా నవ్వుకుంటాను. నాకు పిచ్చి పట్టిందా? అని నా పిల్లలు ఆశ్చర్య పోతుంటాయి. అయోధ్యలో ఓడిపోయామని నేను వాటికి చెపుతాను' అని ఆ వీడియోలో గ్రోవర్ పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో అయోధ్యలో రామమందిరంలో బాల రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఎన్నికల్లో గెలుపు కోసం రామ మందిరంలో బాల రాముడి ప్రతిష్ఠకు బీజేపీ తెర తీసిందంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఫైజాబాద్ లోక్‌సభ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అభ్యర్థి అవదేశ్ ప్రసాద్... తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి లులూ సింగ్‌పై ఘన విజయం సాధించారు. ఈ ఫైజాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో అయోధ్య ఉంది. దీంతో ఆ నియోజకవర్గ ప్రజలు బీజేపీకి సరైన గుణపాఠం చెప్పారంటూ ఇప్పటికే ఇండియా కూటమిలోని పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ఆ క్రమంలో మహువా మొయిత్రా సైతం ఇదే తరహాలో వ్యంగ్యంగా విమర్శించారు. అయితే ఈ వీడియోను మహువా మొయిత్రా రెండోసారి షేర్ చేశారు.

కిడ్నీ విక్రయ ముఠా గుట్టురట్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరం కేంద్రంగా కిడ్నీలు విక్రయిస్తున్న ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. ఐదు రాష్ట్రాల్లో దాడులు జరిపి ఈ రాకెట్‌తో సంబంధం ఉన్న నిందితులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన వారి కిడ్నీలు సేకరించి అవయవాలు అవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బంగ్లాదేశ్‌కు చెందిన కొంతమంది అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పక్కా సమాచారంతో దాడులు చేసిన పోలీసులు... ఢిల్లీలోని జసోలా విహార్‌లో రస్సెల్, రోకాన్, సుమోన్ మియాన్, రతేశ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు. హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీలో దాడులు చేసి మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ముఠా నుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో ముగ్గురు బంగ్లాదేశ్‌కు చెందిన వారు ఉన్నారు. అరెస్టైన వారిలో నొయిడా ఆస్పత్రిలో అక్రమంగా ఆపరేషన్లు చేసి భారీగా డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ విజయ కుమారి ఉన్నారు. ఒక్కో ఆపరేషన్‌కు ఆమె రూ.2 నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముఠా ప్రధానంగా బంగ్లాదేశ్‌కు చెందిన వారి కిడ్నీలను రూ.4 నుంచి రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కొన్నిసార్లు ఉద్యోగాలు కూడా ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు ఎర వేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

అసెంబ్లీ ప్రతిష్ఠ పెంచుతాం

- సభలో ప్రతి సభ్యునికి గౌరవం దక్కేలా నిర్వహణ
- పటిష్టవంతంగా పోలీసు బందోబస్తు
- మండలి చైర్మన్ మోషేన్ రాజు, స్పీకర్ అయ్యన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : శాసనసభ ప్రతిష్ఠ పెంచేలా సమావేశాలు జరగాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆకాంక్షించారు. ఈనెల 22 నుంచి రాష్ట్ర శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో అన్ని శాఖల కార్యదర్శులతో శాసనసభ సమావేశ మందిరంలో శుక్రవారం వారిద్దరూ ఆర్థిక, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధి విధానాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండలి చైర్మన్ మోషెన్ రాజు మట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వ్యవహరించేది ప్రభుత్వ అధికారులేనని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలంటే అధికారుల పాత్ర కీలకమన్నారు. సభలో ప్రజా ప్రతినిధులు చర్చించి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు జరిగినట్టే అని భావించి తదనుగుణంగా హామీలు కార్యరూపం దాల్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే ప్రభుత్వం పారదర్శకమైన పాలన ప్రజలకు అందించినట్లు అవుతుందని చైర్మన్ తెలిపారు. సభలో ప్రతి ఒక్క సభ్యునికి గౌరవం దక్కేలా నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ సభలో చర్చ సజావుగా జరగాలంటే సంబంధిత శాఖల అధికారుల పాత్ర అత్యంత కీలకమని గ్రహించాలన్నారు. నిర్దిష్ట గడువులోపు సభలో చర్చకు వచ్చే అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు సకాలంలో మంత్రులకు అందజేయాలని ఆదేశించారు. అవసరమైతే ఒకరోజు ముందుగానే అధికారులు మంత్రులతో సమావేశం ఏర్పాటు చేసుకుంటే మంచిదని సూచించారు. సభలో మంత్రులు ఇచ్చే సమాధానాలు సభ్యులతో పాటు అవి ప్రజలకు కూడా చేరుతాయని గ్రహించాలని, సమావేశాలు జరుగుతున్న సమయంలో సమన్వయ కర్తగా ఒక నోడల్ అధికారిని కూడా నియమించి అధికారులకు, మంత్రులకు సహకరించేందుకు కృషి చేయాలని స్పీకర్ కోరారు. శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీతనంతో అర్థవంతమైన చర్చలతో ప్రజలకు మేలు జరిగేలా ఉభయ సభల నిర్వహణకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ ఎం.విజయారాజు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయండి

శాసనసభ సమావేశాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని మండలి చైర్మన్, స్పీకర్‌లు అనంతరం పోలీసు శాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో గ్యాలరీల్లో ప్లకార్డులతో కొంతమంది ప్రవేశించిన సంఘటనలు గతంలో చూశామని, అలాంటివి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అసెంబ్లీ గ్యాలరీల్లోకి ప్రవేశించే వారిని పూర్తిగా తనిఖీ చేశాకే అనుమతించాలని స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే అనుమతించాలన్నారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు 88 మంది కొత్తగా ఎన్నికయిన శాసన సభ్యులు, 9 మంది శాసన మండలి సభ్యులు రానున్నారని, వారిని గుర్తించేందుకు అసెంబ్లీ సిబ్బందిని ప్రవేశ ద్వారాల వద్ద ప్రత్యేకంగా నియమించాలని స్పీకర్ సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని అన్ని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసే విధంగా చూడాలని, బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందికి, మీడియాకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

అధ్యక్ష ఎన్నికల బరినుంచి బైడెన్ ఔట్?

రేసులోకి కమలా హ్యారిస్

మరికొద్దిరోజుల్లో ప్రకటన వచ్చే అవకాశం



వాషింగ్టన్: మరికొద్ది నెలల్లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండగా... రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కే విజయావకాశాలున్నట్లు మీడియా కథనాలు వస్తుండటం, మరో సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత, మరోవైపు ఆరోగ్య సమస్యలు వేధిస్తున్న క్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ ఎన్నికల బరి నుంచి తప్పుకోనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆయన ఈ వారాంతంలోపే కీలక ప్రకటన చేయనున్నట్లు అమెరికా మీడియా కోడై కూస్తోంది. కాగా అసోసియేటెడ్ ప్రెస్-నేషనల్ ఒపీనియన్ రీసెర్చ్ సెంటర్ (ఏపీ-ఎన్ఓఆర్సీ) తాజాగా నిర్వహించిన సర్వేలో జో బైడెన్‌కు బదులుగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌ను అధ్యక్ష బరిలోకి నిలపడం మంచిదని డెమోక్రాట్లు భావిస్తున్నట్లు తేలింది. డెమోక్రాట్లలో ఎక్కువ మంది కమలవైపే మొగ్గు చూపారు. ప్రతి 10 మంది డెమోక్రాట్లలో ఆరుగురు కమలా హ్యారిస్ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని సమర్థించారు. ఇద్దరు ఆమెకు మద్దతు తెలపకపోగా, మరో ఇద్దరు తమకు తెలియదని చెప్పారని సర్వే తెలిపింది. ట్రంప్‌తో లైవ్ డిబేట్‌లో తేలిపోవడం, అనేకచోట్ల గందరగోళానికి గురవ్వడం వంటి కారణాలతో జో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలంటూ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు ప్రత్యామ్నాయంగా కమలా హ్యారిస్ వైపు డెమోక్రాట్లు చూస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ట్రంప్‌కు పోటీగా కమలను బరిలోకి దింపాలని భావిస్తున్నారు. అలాగే కమలా హ్యారిస్ దేశ అధ్యక్ష బాధ్యతలు చేపడితే ఆమె పనితీరుపై కూడా సర్వేలో అమెరికన్లు తమ నిర్ణయాన్ని తెలియజేశారు. 10 మంది అమెరికన్లలో ముగ్గురు మాత్రమే కమలా హ్యారిస్ అధ్యక్షురాలిగా రాణించగలరని చెప్పారు. రాణించలేరని ఐదుగురు, ఏం చెప్పలేమని మరో ఇద్దరు వెల్లడించారు. కమలపై కూడా జో బైడెన్?పై ఉన్నంత సానుకూలతే అమెరికన్లలో ఉన్నట్లు తేలింది. ప్రతి 10 మందిలో నలుగురు కమలపై సానుకూల అభిప్రాయాన్ని కలిగి ఉండగా, మరో ఐదుగురు ఆమెకు అనుకూలంగా లేరు. అదే సర్వేలో జో బైడెన్‌కు ఆరుగురు ప్రతికూల దృక్పథంతో ఉన్నట్లు తేలింది. దాదాపు మూడొంతుల మంది డెమోక్రాట్‌లు కమలా హ్యారిస్‌పై సానుకూల దృక్పథంతో ఉన్నారు. ఇన్ని ప్రతికూలతల నేపథ్యంలో అధ్యక్ష రేసులో కొనసాగడంపై బైడెన్ కూడా పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ సాధించిన విజయాల పట్ల సంతోషంగా ఉన్నానని డెమోక్రాట్ ఓక్లీ గ్రాహమ్ తెలిపారు. కమల్ హ్యారిస్‌కు మద్దతు ఇవ్వడానికి మరింత ఉత్సాహంగా ఉంటానని పేర్కొన్నారు. అమెరికాకు కమలా హ్యారిస్ మహిళ అధ్యక్షురాలు అవుతారని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మిస్సోరీలోని పార్టీ కార్యాలయంలో ఓక్లీ గ్రాహమ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కోవిడ్ బారిన పడిన బైడెన్ ప్రస్తుతం డెలావర్‌లోని తన ఇంట్లో క్వారంటైన్‌లో ఉన్నారు. తాను తీవ్ర అనారోగ్యానికి గురైతే అధ్యక్ష రేసు నుంచి వైదొలగడంపై ఆలోచిస్తానని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బైడెన్ చెప్పారు కూడా. ఈ తరుణంలో కోవిడ్ నుంచి కోలుకున్న తర్వాత ఈ వారాంతంలో అధ్యక్ష ఎన్నికల్లో నిలిచేదీ లేదా తప్పుకునేది అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆయన స్థానంలో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌ను డెమోక్రాట్ల అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆమె పోటీ కోసం సిద్ధమవుతున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. తన రన్నింగ్ మేట్ ఎవరనే దానిపై కూడా ఆమె చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

జస్టిస్ రవీంద్రబాబు సేవలు ప్రశంసనీయం

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు అందించిన సేవలు ప్రశంసనీయమైనవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ కొనియాడారు. ఎ.వి.రవీంద్రబాబు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాలులో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ 1962లో పూర్వపు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం తిమ్మాయపాలెంలో రైతు కుటుంబంలో జన్మించిన రవీంద్రబాబు... ప్రకాశం జిల్లాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పిదప నెల్లూరులోని వీఆర్ న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం పూర్తి చేశారని వివరించారు. న్యాయ వృత్తిలో మూడు దశాబ్దాల పాటు సేవలు అందించిన ఈయన ఎన్నో క్లిష్టమైన కేసులను ఎంతో సునాయాసంగా పరిష్కరించారని గుర్తు చేశారు. చట్టాల అభివృద్ధితో వివిధ కమిటీల్లో సభ్యులుగా పరిపాలనా వ్యవస్థను మెరుగుపర్చడంలో ఎంతగానో దోహదపడ్డారని అభినందించారు. జస్టిస్ ఎ.వి.రవీంద్రబాబు మాట్లాడుతూ న్యాయమూర్తిగా తన ప్రస్థానంలో సహాయ సహకారాలు అందించిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తితో పాటు పూర్వపు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయవాదులు, తన పేషీ అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ హైకోర్టుతో నా బంధం 2021 జనవరి నుంచి ప్రారంభమై, అతి తక్కువ సమయంలోనే ముగుస్తున్నదనే విషయం ఏ మాత్రం ప్రధానం కాదన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఏపీ హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ రవీంద్రబాబు న్యాయ వ్యవస్థకు మంచి సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపీ జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.